మా కలం.. మీ గళం..

# మన గళం

దిన పత్రిక

RNI : APTEL/ 2017/74310

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 181 | మంగళవారం | 30 - 12 - 2025 | పేజీలు: 8 | వెల: 4

## సిఐటియు 18వ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయండి




3లో..




## ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం కీలక

# నిర్ణయాలు

- ☐ జిల్లాల పునర్వ్యవస్థీకరణకు ఆమోదం
- ☐ జనవరి ఒకటి నుంచి కొత్త మార్పులు అమలు
- ☐ పరిపాలన ప్రజలకు చేరువయ్యేలా చర్యలు

మన గళం, అమరావతి : చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మొత్తం ఇరవై నాలుగు అంశాలపై చర్చించి ఆమోదం తెలిపినట్లు మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని జిల్లాల స్వరూపంలో మార్పులు, చేర్పులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మార్పులన్నీ జనవరి ఒకటి నుంచి అమల్లోకి రానున్నాయని స్పష్టం చేశారు.సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రులు, ప్రజాబీ. ష్టం మేరకే ఈ నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. రాష్ట్రంలోని పదిహేడు జిల్లాల్లో మార్పులు జరిగాయని, తొమ్మిది జిల్లాలను యథాతథంగా కొనసాగించనున్నట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, యర్రగొండపాలెం ప్రాంతాలను కలిపి కొత్తగా మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేయడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. అలాగే బనగానపల్లె, అడ్డరోడ్డును కొత్త రెవెన్యూ డివిజన్లుగా ఏర్పాటు చేయనున్నారు. అన్నమయ్య జిల్లా పేరును అలాగే కొనసాగిస్తూ, జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుంచి మదనపల్లెకు మార్చాలని నిర్ణయించినట్లు మంత్రులు వెల్లడించారు. పెనుగొండ పేరును 'వాసవీ పెనుగొండ'గా మార్చే ప్రతిపాదనకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గత ప్రభుత్వం ప్రజాభిప్రాయం

2 లో..








## ఇన్సీ్వ కౌండిన్య తొలి

# సముద్ర ప్రయాణం

- భారత సముద్ర వారసత్వానికి గర్వకారణం : ప్రధాని మోదీ

మన గళం, న్యూఢిల్లీ : భారత నౌకాదళానికి చెందిన ఇన్సీ్వ కౌండిన్య తన తొలి సముద్ర ప్రయాణాన్ని పోర్బందర్ నుంచి ఒమాన్‌లోని మస్కట్ దిశగా ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రాచీన భారతీయ స్టిచ్డ్ షిప్ సాంకేతికతతో నిర్మించిన ఈ నౌక, భారతదేశానికి ఉన్న గొప్ప సముద్ర సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పుతోందని



2 లో..


## చొరబాటుదారులను వెనక్కి

# పంపిస్తాం



- బంగ్లాదేశ్ చొరబాట్లు సంస్కృతికి ముప్పు
- అభివృద్ధి  గుర్తింపు రక్షణకే ప్రాధాన్యం
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా

మన గళం డెస్క్ : భారతదేశంలో ఎక్కడ ఉన్నా బంగ్లాదేశ్ చొరబాటుదారులను వెనక్కి పంపిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. అసోంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, సరిహద్దులు దాటి రాష్ట్రంలోకి చొరబడిన బంగ్లాదేశీయులు స్థానిక ప్రజల సంస్కృతి, సాంప్రదాయాలు, గుర్తింపులకు ముప్పుగా మారుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వారిని ఓటు బ్యాంకుగా చూస్తోందని తీవ్రంగా ఆరోపించారు.ఆ ఓటు బ్యాంకును కాపాడుకోవడానికే ప్రతిపక్ష కూటమి ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వ్యతిరేకిస్తోందని అమిత్ షా విమర్శించారు.



2 లో..

## మంతెన సత్యనారాయణ రాజుకు

# ప్రభుత్వంలో కీలక బాధ్యతలు

- ప్రకృతి వైద్య సలహాదారుగా నియామకం జీవో జారీ
- కార్టూనిస్ట్ శ్రీధర్ రావుకూ ప్రభుత్వ సలహాదారు పదవి

మన గళం, అమరావతి : ప్రకృతి వైద్య రంగంలో దేశవ్యాప్తంగా గుర్తింపు పొం దిన డాక్టర్ మంతెన సత్యనారా యణ రాజుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించింది. రాష్ట్ర ప్రభుత్వా నికి ప్రకృతి వైద్య సలహాదా రుగా ఆయనను నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై రాష్ట్రంలో ప్రకృతి వైద్య విధానాల ప్రోత్సాహం, ప్రజారోగ్య ంపై అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య విధానాల రూపకల్పనలో ప్రభుత్వం ఆయన సలహాలు తీసుకోనుంది.గత కొన్ని దశాబ్దాలుగా ప్రకృతి వైద్యాన్ని సామాన్య ప్రజల జీవితాలకు చేరువ చేసే ప్రయత్నంలో మంతెన సత్యనారాయణ రాజు ముందుండి పనిచే స్తున్నారు. మందులపై ఆధారపడకుండా ఆహార నియమాలు, జీవనశైలి మార్పుల ద్వారా అనేక రుగ్మతలకు ఉపశమన మార్గాలు చూపుతూ ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించారు. విజయవాడ సమీపంలోని ఉండవల్లి కరకట్టపై ఏర్పాటు చేసిన ప్రకృతి చికిత్సాలయం ద్వారా వేలాది మందికి వైద్య




2 లో..



## న్యూ ఇయర్ వేడుకలకు

# గ్రీన్ సిగ్నల్

మన గళం, అమరావతి : నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ 31, జనవరి 1 తేదీల్లో న్యూ ఇయర్ సెలబ్రేషన్లను దృష్టిలో ఉంచుకుని మద్యం దుకాణాలు, బార్ల కార్యకలాపాల వేళలను పొడిగించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ రెండు రోజుల్లో అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం విక్రయాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ వెసులుబాటు బార్లు, ఇన్-హౌస్ లైసెన్సులు, ఈవెంట్ పర్మిట్ లైసెన్సులకు కూడా వర్తిస్తుందని స్పష్టం చేసింది.

2 లో..

## మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ

- పోలీసుల అభ్యర్థనతో రిమాండ్ పొడిగింపు
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయమూర్తి ఎదుట హాజరు

మన గళం, విజయవాడ : మావోయిస్టు కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. పటమట, పెనమలూరు పోలీసులకు చిక్కిన మావోయిస్టు నిందితులకు మరోసారి



2 లో..

## ఆంధ్రప్రదేశ్‌లో నేరాల సంఖ్య

# గణనీయంగా తగ్గింది

- ఆధునిక పోలీసింగ్‌పై ప్రత్యేక కార్యాచరణకు సిద్ధం

మన గళం, అమరావతి : గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వెల్లడించారు. 2025 సంవత్సరానికి సంబంధించి పోలీసుల పనితీరుపై రూపొందించిన ప్రత్యేక నివేదికను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ




2 లో..

## ప్రమాదకర స్థాయికి చేరిన

# పొగమంచు



2 లో..

# మంత్రివర్గం కీలక నిర్ణయాలు

లేకుండా జిల్లాల విభజన చేయడం వల్ల సమస్యలు తలెత్తాయని, వాటిని సరిదిద్దడానికే ఈ చర్యలు తీసుకుంటున్నామని మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ వివర్శించారు. పోలవరం పరిసర ప్రాంతాలతో పాటు రాయచోటిని కూడా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీల అమలులో వెనుకడుగు వేయబోమని మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు. మౌలిక వసతుల అభివృద్ధికి భారీగా నిధులు వెచ్చిస్తున్నామని, కొప్పర్తి, ఓర్వకల్లు వంటి ప్రాంతాలకు పెట్టుబడులు ఆకర్షిస్తున్నామని చెప్పారు. మచిలీపట్నం నుంచి హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ వరకు రహదారి నిర్మాణం జరుగుతోందని, కేంద్రం నుంచి పూర్తి సహకారం అందుతోందని ధీమా



వ్యక్తం చేశారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణతో పాటు సాంఘిక సంక్షేమ శాఖ రుణాలపై ఉపశమనం, ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, విశాఖపట్నంలో ఆసుపత్రి నిర్మాణానికి భూమి కేటాయింపు వంటి కీలక నిర్ణయాలకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాలతో పరిపాలన ప్రజలకు మరింత చేరువ అవుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

## మంతెన సత్యనారాయణ రాజుకు ప్రభుత్వంలో కీలక బాధ్యతలు

సేవలు అందించారు. విజయవాడ, నరసాపురం ప్రాంతాల్లో కూడా ఆయన ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్రాలు కొనసాగుతున్నాయి. టెలివిజన్ కార్యక్రమాలు, యూట్యూబ్ వంటి డిజిటల్ మాధ్యమాల ద్వారా ప్రకృతి వైద్య విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. ప్రజారోగ్యాన్ని కేంద్రంగా చేసుకుని ప్రభుత్వం రూపొందిస్తున్న విధానాల్లో ప్రకృతి వైద్యానికి ప్రత్యేక స్థానం కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ నియామకం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఆధునిక వైద్యంతో పాటు ప్రత్యామ్నాయ చికిత్సా విధానాల సమన్వయంతో ప్రజలకు ఆరోగ్యకర జీవనశైలి అలవాటు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోందని సమాచారం. ఇదే సమయంలో మాస్ కమ్యూనికేషన్ రంగంలో విశేష అనుభవం కలిగిన పోచంపల్లి శ్రీధర్ రావును కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సలహాదారుగా నియమించింది. సమాచార ప్రసారం, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే అంశాల్లో ఆయన సూచనలు ఇవ్వనున్నారు. ప్రముఖ కార్టూనిస్ట్‌గా గుర్తింపు పొందిన శ్రీధర్ రావు, ఈనాడు దినపత్రికలో సుదీర్ఘకాలం సేవలు అందించారు. డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు, పోచంపల్లి శ్రీధర్ రావు ఇద్దరూ రెండేళ్ల పాటు ఈ సలహాదారు పదవుల్లో కొనసాగనున్నారు. ప్రజారోగ్యం, సమాచార వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యానికి ఈ నియామకాలు దోహదపడతాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

## ఆంధ్రప్రదేశ్‌లో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గింది

రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ స్పష్టమైన పురోగతి సాధించిందని తెలిపారు. ప్రత్యేకంగా మహిళల భద్రత విషయంలో చేపట్టిన చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని డీజీపీ చెప్పారు. మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టడంలో, వేధింపుల కేసులను వేగంగా పరిష్కరించడంలో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని వివరించారు. అదే విధంగా మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి గంజాయి, డ్రగ్స్ వ్యాపారాన్ని కట్టడి చేయడంలో గణనీయమైన విజయాలు సాధించామని చెప్పారు. దొంగిలించిన మొబైల్ ఫోన్ల రికవరీలో ఆధునిక సాంకేతికతను వినియోగించి వేల సంఖ్యలో ఫోన్లను బాధితులకు తిరిగి అందించామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పోలీసింగ్ వ్యవస్థను మరింత ఆధునికంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు తీసుకుంటున్నామని డీజీపీ స్పష్టం చేశారు. వచ్చే పదేళ్లలో పోలీసింగ్ ఎలా ఉండాలి, ఎలాంటి మార్పులు అవసరం, సాంకేతికతను ఎలా సమర్థంగా వినియోగించాలి అనే అంశాలపై రెండు రోజుల పాటు ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సంక్రాంతి పండుగ అనంతరం ఈ వర్క్‌షాప్ జరుగుతుందని, పోలీసు విధుల్లో మార్పులు, ఆధునిక సాంకేతిక వినియోగంపై లోతైన చర్చలు జరుగుతాయని చెప్పారు. ప్రజలు ప్రత్యక్షంగా కొత్త పోలీసింగ్ విధానాన్ని అనుభవించేలా ఈ కార్యక్రమం ఉండనుందని తెలిపారు. చట్టం ముందు అందరూ సమానమేనని డీజీపీ మరోసారి స్పష్టం చేశారు. ఎవరు చట్టానికి విరుద్ధంగా వ్యవహరించినా, ఎంతటి వారైనా సరే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా నిరంతర నిఘా కొనసాగిస్తూ మావోయిస్టు కార్యకలాపాలను కూడా కట్టడి చేస్తున్నామని, ఇటీవల పలువురు మావోయిస్టులను అరెస్ట్ చేయడం ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు.

## న్యూ ఇయర్ వేడుకలకు గ్రీన్ సిగ్నల్

అదేవిధంగా, ఏపీ టూరిజం ఆధ్వర్యంలో పనిచేసే లైసెన్సుల విషయంలో మరింత సడలింపు ఇచ్చింది. ఈ లైసెన్సుల కింద ఉన్న యూనిట్లకు డిసెంబర్ 31, జనవరి 1 తేదీల్లో రాత్రి 1 గంట వరకు మద్యం విక్రయాలకు అనుమతి ఇచ్చినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు అధికారిక మెమో జారీ కాగా, ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ పియూష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పర్యాటకులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. అయితే, మద్యం విక్రయాల వేళలు పొడిగించినప్పటికీ చట్టం, శాంతిభద్రతలు, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిందేనని ప్రభుత్వం కఠినంగా హెచ్చరించింది. పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన పర్యవేక్షణ కొనసాగిస్తామని అధికారులు తెలిపారు. న్యూ ఇయర్ వేడుకలను భద్రంగా, నియమ నిబద్ధతతో జరుపుకోవాలని ప్రభుత్వం ప్రజలకు సూచించింది.

## ఇన్స్వీ కౌండిన్య తొలి సముద్ర ప్రయాణం

ఆయన అన్నారు. ఈ విశిష్ట నౌక రూపకల్పనలో భాగమైన డిజైనర్లు, శిల్పకారులు, నౌక నిర్మాణ నిపుణులు, అలాగే భారత నౌకాదళం చేసిన కృషిని ప్రధాని ప్రశంసించారు. ప్రాచీన జ్ఞానాన్ని ఆధునిక కాలానికి తీసుకువచ్చేలా ఈ నౌకను సాకారం చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన అభినందనలు తెలిపారు. పోర్బందర్ నుంచి మస్కట్ వరకు సాగనున్న ఈ ప్రయాణం ద్వారా గల్ఫ్ ప్రాంతంతో భారతదేశానికి ఉన్న చారిత్రక సంబంధాలు మరొకసారి గుర్తుకు వస్తాయని ప్రధాని అన్నారు. ఈ ప్రయాణం సురక్షితంగా, స్మరణీయంగా సాగాలని నౌక సిబ్బందికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఇన్స్వీ కౌండిన్య వంటి ప్రయత్నాలు భారత సముద్ర వారసత్వాన్ని రాబోయే తరాలకు చేరవేసేలా చేస్తాయని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

## చొరబాటుదారులను వెనక్కి పంపిస్తాం

అసోంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నో ఏళ్లు అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్ర అభివృద్ధి కోసం గణనీయమైన చర్యలు తీసుకోలేదని దుయ్యబట్టారు. దీనికి భిన్నంగా ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజల సాంస్కృతిక గుర్తింపును కాపాడటంతో పాటు సమగ్ర అభివృద్ధిపై దృష్టి పెట్టిందని పేర్కొన్నారు. బంగ్లాదేశ్ చొరబాటుదారులు ఆక్రమించుకున్న లక్షకు పైగా బిఘాల భూమిని హిమంత బిశ్వ శర్మ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుందని అమిత్ షా కొనియాడారు. రాష్ట్రంలో పాతుకుపోయిన చొరబాటుదారులను పూర్తిగా నిర్మూలించాలంటే భారతీయ జనతా పార్టీకి మరో అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. గత పదకొండు ఏళ్లలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలోని పలు మిలిటెంట్ సంస్థలతో శాంతి ఒప్పందాలు కుదుర్చుకుని శాంతిభద్రతలను మెరుగుపరిచిందని ఆయన గుర్తు చేశారు.

## ప్రమాదకర స్థాయికి చేరిన పొగమంచు



- ఢిల్లీలో స్థంభించిన రాకపోకలు
- రోడ్డు, రైలు, వాయు మార్గాలకు అంతరాయం
- ప్రజలకు అప్రమత్తత సూచనలు

మన గళం, న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీని దట్టమైన పొగమంచు పూర్తిగా కమ్మేసింది. ఉదయం నుంచి విజిబిలిటీ అత్యంత తక్కువగా మారడంతో సమీపంలో వెళ్తున్న వాహనాలు కూడా కనిపించని పరిస్థితి ఏర్పడింది. దీంతో రోడ్డు మార్గంలో ప్రమాదాల ముప్పు పెరిగింది. రైలు, వాయు మార్గాల్లోనూ రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తీవ్ర పొగమంచు నేపథ్యంలో భారత వాతావరణ శాఖ ఢిల్లీకి అత్యున్నత హెచ్చరికను జారీ చేసింది. ప్రజలు అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప బయటకు రావద్దని సూచించింది. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, పొగమంచు లైట్లు వినియోగించాలని హెచ్చరించింది. ముఖ్యంగా ఉదయం వేళ ప్రయాణాలు తగ్గించాలని తెలిపింది. పొగమంచు ప్రభావంతో ఢిల్లీ విమానాశ్రయానికి వచ్చే, వెళ్లే విమానాల్లో పెద్ద ఎత్తున ఆలస్యాలు చోటుచేసుకున్నాయి. మొత్తం నూట ఇరవై ఎనిమిది విమానాలు ఆలస్యంగా నడుస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో అరవై నాలుగు రాకలు, అరవై నాలుగు బయలుదేరే విమానాలు ఉన్నాయి. కొన్ని విమానాలను ఇతర విమానాశ్రయాలకు మళ్లించారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులు విమానాశ్రయానికి వెళ్లే ముందు తమ విమానాల స్థితిని తప్పనిసరిగా తెలుసుకోవాలని సూచనలు జారీ చేశారు. మరోవైపు రాజధాని ఎక్స్‌ప్రెస్, వందే భారత్, జన శతాబ్దీతో సహా పలు రైళ్లు కూడా ఆలస్యంగా నడుస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, ఢిల్లీలో గాలి నాణ్యత సూచిక ప్రమాదకర స్థాయికి చేరింది. ఈ పరిస్థితుల్లో చిన్న పిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు మరింత జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



## కొత్తూరు సుబ్బరాయునిలో వసతి గృహ నిర్మాణమునకు ఒక లక్ష విరాళం..!

- ఆలయ ఈవో యం. రామక్రిష్ణ



మన గళం, డిసెంబర్ 29. ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసి ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం నందు భక్తుల సౌకర్యార్థం నిర్మాణము గావించబడుతున్న వసతి గృహము నిర్మాణము నిమిత్తము భక్తులు 1 లక్ష 1116/ లు సోమవారం విరాళంగా సమర్పించినట్లు ఆలయ ఈవో యం.రామకృష్ణ తెలిపారు. కర్నూలు పట్టణంలో చెందిన పంచాగ్నుల మల్లికార్జున శాస్త్రి జ్ఞాపకార్థం కుమారుడు పి.రమేష్ భరద్వాజ్ అనే భక్తుడు వారికి స్వామివారు ఇంటి ఇలవేల్పు కావడంతో మొక్కుబడిగా రూ.1,01,116/ లు ఒక లక్ష ఒక వెయ్యి నూట పదహారు రూపాయలు విరాళంగా సమర్పించారని, వారికి ఆలయ మర్యాదలతో అభిషేకములు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించి శేష వస్త్రములతో సత్కరించి, స్వామివారి ప్రతిమ, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సురేష్ శర్మ, గ్రామ పెద్దలు మిలిటరీ సుబ్బారెడ్డి, దాత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ

బిగ్ షాక్ తగిలింది. ఈ రోజు ముగియాల్సిన వారి రిమాండ్‌ను పోలీసులు మరింత సమగ్ర దర్యాప్తు అవసరమని పేర్కొంటూ పొడిగించాలంటూ కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు నిందితులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయాధికారికి హాజరు పరచగా, రిమాండ్ పొడిగింపుకు అనుమతి లభించింది. కోర్టు ఆదేశాల మేరకు మావోయిస్టు నిందితుల రిమాండ్‌ను ఈ నెల 12వ తేదీ వరకు పొడిగించారు. ప్రస్తుతం ఈ నిందితులు నెల్లూరు కేంద్ర కారాగారం, రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. వీరిని మరికొన్ని రోజుల పాటు కస్టడీలో ఉంచి విచారించాల్సిన అవసరం ఉందని పోలీసులు కోర్టుకు వివరించారు. మావోయిస్టులను లోతుగా విచారిస్తే మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. నెట్వర్క్ విస్తృతి, కార్యకలాపాల వెనుక ఉన్న వ్యూహాలు, సహకారుల వివరాలపై స్పష్టత రావాల్సి ఉందని అధికారులు తెలిపారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సిఐటియు 18వ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయండి

**- సీఐటీయు రాష్ట్ర నాయకులు ఎంఏ గఫూర్**

మనగళం, కర్నూలు సిఐటియు 18వ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో రెడ్ షర్ట్ కవాతుసుందరయ్య సర్కిల్ కొత్త బస్టాండ్ నుండి ప్రారంభమై బళ్లారి చౌరస్తా ఫోర్త్ టౌన్ ఎస్ ఏ పి క్యాంప్ మీదుగా రెడ్ షర్ట్ కవాతుతిరిగి సుందరయ్య సర్కిల్ ను చేరుకొని ముగింపు చేయడం జరిగింది.రెడ్ షర్ట్ కవాతు కార్యక్రమాన్ని సిఐటియు రాష్ట్ర నాయకులు ఎంఏ గఫూర్ జెండాను ఊపిరి ప్రారంభించారు. సిఐటియు జిందాబాద్ సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయండి లేబర్ కోడ్లను రద్దు చేయాలని 12 గంటల పని విధానాన్ని రద్దు చేయాలి కవాతులో కార్మికులుపెద్ద ఎత్తున నినాదాలుచేశారు.ఈకార్యక్రమానికి సిఐటియు నగర నాయకులు సిహెచ్ సాయిబాబా అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర నాయకులు ఎంఏ గఫూర్ శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పీ నిర్మల సిఐటియు న్యూ సిటీ ప్రధాన కార్యదర్శి ఆర్ నరసింహులు జిల్లా నాయకులు టి రాముడు ఇన్సూరెన్స్ రంగం రాష్ట్ర నాయకులు రఘుబాబు గారులు రెడ్ షర్టు కవాతుకు విచ్చేసిన కార్మికులను ఉద్దేశించిమాట్లాడుతూ సిఐటియు 18వ అఖిలభారత మహాసభలు విశాఖపట్నంలో డిసెంబరు 31 నుండి 2026 జనవరి 4వ తారీఖు వరకు ఐదు రోజులపాటు మహాసభలు జరుగుతున్నాయి కార్మికులు ఉద్యోగుల సమస్యల పైన చర్చించి భవిష్యత్తు పోరాటాలకు పిలుపు ఇవ్వబోతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ ను తీసుకువచ్చి 12 గంటల పని చేయాలని రాత్రి సమయంలో కూడా మహిళలు పనులు చేయాలని చట్టాలను చేస్తూ నిరంకుశంగా వ్యవహరిస్తున్నాయి. కార్మికులకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు పర్మనెంట్ చేయాలని స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అసంఘటితరంగా కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని భవనము ఆటో హమాలీ కార్మికులకు 50 సంవత్సరాలు వయస్సు నిండిన కార్మికులకు నెలకుపదివేల పెన్షన్ ఇవ్వాలని ఇల్లు లేని కార్మికులకు ఇళ్ల స్థలం ఇచ్చి ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఉచితంగా ఇవ్వాలని ఉపాధి అవకాశాలు కల్పించాలని కార్మికులసమస్యలుపట్టించుకోవాలని దశలవారీగా అనేక పోరాటాలు చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరంకుశంగా కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను చేస్తూ కార్పొరేటు శక్తులైన అదాని అంబానీలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయి. ప్రభుత్వ రంగాలన్నింటినీ కారు చౌకగా కార్పొరేట్ వ్యక్తులకు



ధారాధత్తము చేస్తున్నది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కార్మిక వ్యతిరేకవిధానాలకు వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధం కావాలని మరో స్వాతంత్ర పోరాటానికి కార్మిక వర్గం సిద్ధం కావాలని పిలుపునిస్తూ సిఐటియు18ఆల్ఇండియా మహాసభలు విశాఖపట్నంలో జరుగుతున్నాయి. ఈ మహాసభల విజయవంతం కోసం కార్మిక వర్గం పెద్ద ఎత్తున అన్ని రంగాల కార్మికులను ఏకం చేసి చలో విశాఖ అంటూ బండి వెనక బండి అంటూ జీపులు బస్సులు లారీలు ఆటోలు ఏర్పాటు చేసుకొని వేలాదిగా విశాఖపట్నంలో 4వ తారీఖున జరిగే భారీ ర్యాలీ బహిరంగ సభను హాజరైజయప్రదం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. కార్మిక వర్గం చేపట్టిన ఈ రెడ్ షర్ట్ కవాతు పాలకుల గుండెల్లో దడ పుట్టించే లాగా చేసినందుకు మీకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర నాయకులు కే సుధాకరప్ప, ఎస్ఎండి మహమ్మద్ రఫీ, ఎం వెంకటేశ్వర్లు, జి యేసు, ఆర్. ఓబులేసు, జై లక్ష్మీబాయి, శ్యామల, ఎస్ హుస్సేన్ వలి మల్లీ హమాలి యూనియన్ నాయకులు కే రాజు, గోవిందు, సుబ్బారెడ్డి, వెంకటస్వామి, నాగరాజు, విజయుడు, బిసన్న, ఓబ్లేసు, దేవరాజు, ఆంజనేయులు, సురేష్, ఎంసీ ఆనంద్ భాస్కర్, శ్రీనివాసులు, కె.వి జనార్దన్ రావు, అజ్మత్, దస్తగిరి, మౌలాలి మహిళలు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మనగళం, కర్నూలు ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ (ఆయా) వర్కర్లకు మరియు నైట్ వాచ్మెన్ వర్కర్స్ కు పెండింగ్ వేతనాలు చెల్లించాలని,ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్.

పిఎస్ రాధాకృష్ణ జిల్లా అధ్యక్షులు సిఐటియు

పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని నగర సిఐటియు ఉపాధ్యక్షులు డి కుమార్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు గారు నైట్ వాచ్మెన్ యూనియన్ నాయకులు కృష్ణ గారు ఆయా నాయకులు అయ్యమ్మ గారు సురేఖ గారు పాల్గొన్నారు జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో సమాజంలో అట్టడుగున వున్నటువంటి పేదవర్గాల పిల్లలు చదుకుంటున్నారు, ఆ పేద పిల్లలు చదువుకునే స్కూల్స్,కాలేజీలలో పరిశుభ్రత కోసం భద్రత కోసం ఏర్పాటుచేసిన పారిశుద్ధ్య కార్మికులు నైట్ వాచ్మెన్ వర్కర్స్ తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారు.వీరికి వేతనాలు నెలలు తరబడి రావటం లేదు 4నెలల వేతనాలు పెండింగ్ లో ఉన్నాయి వీరికి వేతనాల పెండింగ్ లో ఉండడం వలన పండగ రోజులు కూడా పస్తులున్నారు,ఇంటిబాడీగలు,కరెంట్ బిల్లులు,పిల్లల చదువుఖర్చులు,ఆరోగ్య ఖర్చులు కిరాణం షాపులలో అప్పులు కట్టలేక చాలా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు,గత %ఐజూ% గారు జీతాలు ఇస్తామన్నారు కాని ఇవ్వలేదు, తక్షణమే జీతాలు ఇవ్వాలని ,అలాగే 300 మంది విద్యార్థులకు ఒక ఆయాను నియమించడం వలన దీనితో కార్మికులపైన పనిభారం పెరిగింది. పనిభారం తగ్గించాలని, వెట్టిచాకిరి చేయించరాదని,50 మంది విద్యార్థులకు ఒక ఆయాను నియమించాలని, ప్రమాద భీమా సౌకర్యం,చనిపోయిన కార్మిక కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలని,యూనిఫామ్,

గుర్తింపుకార్డ్ లు ప్రభుత్వమే ఇవ్వాలని,విద్యార్థులకు తగట్టు వర్కర్స్ ను నియమించాలని కోరుతున్నాము,అలాగే తమరు దయతో పాఠశాలల్లో కళాశాల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్స్ కు, నైట్ వాచ్మెన్ లకు పెండింగ్ లో ఉన్న జీతాలు వెంటనే ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నైట్ వాచ్మెన్, ఆయాలు పాల్గొన్నారు.

# నేడు బికెయంయు తాలూకా సమావేశం



మనగళం : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికెయంయు) తాలూకా సమావేశం మంగళవారం గూడూరు పట్టణంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ఏపీ వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్, జిల్లా కార్యదర్శి నబి రసూల్,కోడుమూరు సిపిఐ మండల కార్యదర్శి రాజు, గూడూరు సిపిఐ మండల కార్యదర్శి బీడీల శ్రీనివాసులు హాజరువుతారని ఏపీ వ్యవసాయ కార్మికసంఘం నియోజకవర్గ కార్యదర్శి శేషుకుమార్ నేడు తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మహాత్మ గాంధీ పేరును తొలగిం చడం,వలసలని నివారించడానికి ప్రతి ఏడాది 200 రోజులు పని కల్పించాలని, ఉపాధి కార్మికునికి కనీస వేతనం రు 300 నుండి 600 లకు పెంచాలని డిమాండ్ చేస్తూ, ప్రతి ఏడాది బడ్జెట్లో నిధులు తగ్గుస్తూ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేయడానికి పన్నాగాలు చేస్తోన్న సమయంలో ఈ సమావేశం చాలా ప్రాముఖ్యత సంతరించుకొంటున్నది అన్నారు. కావున నియోజకవర్గంలో గల ఏపీ వ్యసాకా సంఘం నియోజకవర్గం, మండల, పట్టణ, గ్రామ అధ్యక్ష, కార్యదర్శి మరియు నాయకులు హాజరై జయప్రదం చెయ్యాలన్నారు.

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

**- ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్**

మనగళం, కర్నూలు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు.

కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ గారు మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 101 ఫిర్యాదులు వచ్చాయి. తమ

కోడుకులు చూసుకోవడం లేదని న్యాయం చేయాలని కర్నూలు , కల్లూరు కు చెందిన బి. అయ్యప్ప ఫిర్యాదు చేశారు. లోన్ అమౌంట్ ఇప్పిస్తామని చెప్పి మోసం చేసిన వ్యక్తుల పై చర్యలు తీసుకోవాలని కర్నూలు, క్రిష్ణానగర్ కు చెందిన వినయ్ బాబు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ క్లారీ ఫాక్స్ టెక్నాలజీ లో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి హంపి అనే వ్యక్తి డబ్బులు తీసుకొని మోసం చేశాడని చర్యలు తీసుకోవాలని కర్నూలు , లక్ష్మీ టౌన్ షిప్ కు చెందిన చరణ్ రాజ్ ఫిర్యాదు చేశారు. బంగారం తాకట్టు పెట్టింది ఇవ్వడం లేదని వారి పై చర్యలు తీసుకోవాలని ఎమ్మిగనూరు



కు చెందిన అబ్దల్ ఫిర్యాదు చేశారు. డబ్బులు తీసుకొని భూమిని రిజి స్ట్రేషన్ చేసి ఇవ్వడం లేదని కర్నూలు , వెల్దుర్తి మండలం, రత్న పల్లి గ్రామం కు చెందిన బోయ రవి కుమార్ ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ లో సాఫ్ట్ వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని నీకోలస్ అనే వ్యక్తి రూ. 2 లక్షల 40 వేలు తీసుకోని మోసం చేశాడని చర్యలు తీసుకోవాలని నంద్యాల జిల్లా, నందికోట్కూరు సాయి చరిత ఫిర్యాదు చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ గారు హామీ ఇచ్చారు.ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, సిఐలు శివశంకర్, శ్రీనివాస నాయక్, రామయ్య నాయుడు లు పాల్గొన్నారు.

# మార్కెట్లోకి వీవో వి35 స్లిమ్ అల్ట్రా 5జీ




హైదరాబాద్ డిసెంబర్ 29, 2025 మనగళం, : స్మార్ట్‌ఫోన్ ప్రియులకు ఆకట్టుకునే డిజైన్‌తో వీవో వి35 స్లిమ్ అల్ట్రా 5జీ భారత మార్కెట్లోకి విడుదలైంది. అత్యంత సన్నని ఆకృతి, తేలికపాటి బాడీతో లగ్జరీ ఫీల్‌ను అందించేలా ఈ కొత్త ఫోన్‌ను వీవో రూపొందించింది. చేతిలో పట్టుకుంటే గాలిలో తేలినంత తేలికగా అనిపించేలా రూపొందించిన ఈ మొబైల్, ఆధునిక సాంకేతికతతో పాటు ఆకర్షణీయమైన రూపకల్పనను కలిపిన మోడల్‌గా కంపెనీ పేర్కొంది.ఈ ఫోన్‌లో 6.78 అంగుళాల అమోలెడ్ తెరను అందించారు. 12 జీబీ ర్యామ్, 256 జీబీ అంతర్గత నిల్వతో ఇది వస్తుంది. ఫోటోగ్రఫీకి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ 300 మెగాపిక్సెల్ ప్రధాన కెమెరా, 32 మెగాపిక్సెల్ ముందు కెమెరాను అమర్చారు. చిత్రీకరణలో స్పష్టత, వివరాలు మెరుగ్గా కనిపించేలా కెమెరా సాంకేతికతను అభివృద్ధి చేశారు.బ్యాటరీ విషయానికి వస్తే 4800 మిల్లీఅంపియర్ సామర్థ్యంతో ఈ ఫోన్‌ను అందించారు. 170 వాట్ల వేగవంతమైన చార్జింగ్ సదుపాయం ఉండటంతో కేవలం 20 నిమిషాల్లోనే పూర్తిగా చార్జ్ అవుతుందని కంపెనీ చెబుతోంది. దీని వల్ల తక్కువ సమయంలోనే ఫోన్ వినియోగానికి సిద్ధమవుతుందని పేర్కొంది.డిజైన్ పరంగా స్లిమ్ బాడీనే ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. తక్కువ మందం, సమతుల్య బరువుతో ఎక్కువసేపు వాడినా చేతికి ఇబ్బంది కలగకుండా రూపొందించారు. సరళమైనా క్లాసీగా కనిపించే రూపంతో ప్రీమియం విభాగాన్ని లక్ష్యంగా ఈ ఫోన్‌ను తీసుకొచ్చినట్టు తెలుస్తోంది. భారత మార్కెట్లో ఈ ఫోన్ ధర సుమారు రూ.49,999 నుంచి ప్రారంభం కానుంది.

# సాయుధ దళాల ఫ్లాగ్ డే నిధికి మెప్మా మహిళా సంఘాల నుంచి రూ.2 లక్షల విరాళం

**- దేశ రక్షణలో నిరంతరం సేవలు అందిస్తున్న సైనిక కుటుంబాలకు అండగా నిలుద్దాం - జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**

మనగళం, కర్నూలు దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన సైనికులు, మాజీ సైనికుల కుటుంబాలకు అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సూచించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో మెప్మా మహిళా సంఘాల నుంచి సాయుధ దళాల సంక్షేమ నిధికి సేకరించిన రూ. 2 లక్షల చెక్కును మహిళా సంఘాల సభ్యులు కలెక్టర్‌కు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు మున్సి పాలిటీల్లో మహిళా సంఘాల సభ్యులు తమ వంతు బాధ్యతగా రూ. 2 లక్షల చెక్కును అందజేశారని, సైనిక కుటుంబాలకు సహాయం చేయాలనే ఉద్దేశంతో మహిళా సంఘాలు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ సామర్థ్యాన్ని బట్టి ఫ్లాగ్ డే నిధికి విరాళాలు అందించి దేశసేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ జి. శ్రీనివాసులు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి రత్న రూత్, జిల్లా సమాఖ్య ప్రెసిడెంట్ టి. పద్మ, తదితరులు పాల్గొన్నారు.



# బాల పురస్కార అవార్డు గ్రహీత శివాని కి పెన్షన్ మంజూరుకై వినతి

మనగళం,కర్నూలు జిల్లా మద్దికెరకు చెందిన పారా అథ్లెట్, జాతీయ బాల పురస్కార్ అవార్డు గ్రహిత శివాని సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి ని కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో కలిసి వినతి పత్రాన్ని అందజేసింది. బాలవార్డు గ్రహీత శివాని తనకు రావాల్సిన పెన్షన్ ను మంజూరు చేసి తన అకౌంట్ లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు విన్నవించింది. అలాగే తన స్వగ్రామం మద్దికేరలో స్టేడియం లేదని మినీ స్టేడియం నిర్మించాలని కలెక్టర్ కు కోరింది. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి బాల పురస్కార్ అవార్డు గ్రహిత శివాని శాలువ కప్పి సన్మానించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శివానికి పెన్షన్ జమ అయ్యియే విధంగా చర్యలు తీసుకోవాలిని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే స్టేడియం నిర్మాణానికి చర్యలు చేపడుతామని కలెక్టర్ తెలిపారు. శివానిని ఆదర్శంగా తీసుకొని బాలికలు ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.



# పిల్లల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రులు కూడా ప్రధాన పాత్ర పోషించాలి

– ప్రభుత్వము పెట్టినటువంటి రెమిడీయల్ క్లాసెస్ విధానము పిల్లలందరూ ఖచ్చితంగా వినియేగించుకోవాలి






మన గళం కోడుమూరు: పదవ తరగతి చదువుతున్న పిల్లల తల్లిదండ్రులారా దయచేసి గమనించండి 10వ తరగతి పిల్లలకు ప్రభుత్వం వారు ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు అదేవిధంగా సాయంత్రము నాలుగు గంటల నుండి 5 గంటల వరకు ప్రతి రోజు కూడా స్లిప్ టెస్ట్ లు కండక్ట్ చేస్తున్నారు కావున మీ పిల్లలు స్కూల్ కి వెళ్తున్నారా లేదా అనేది గమనించవలసిందిగా మిమ్మల్ని కోరుతున్నాము స్కూలుకు వెళ్లిన తర్వాత పిల్లలు పాఠశాలలోనే ఉంటున్నారా ఎగ్జామ్స్ రాసి వస్తున్నారా అనే విషయాలను కూడా తల్లిదండ్రులు తెలుసుకోవాలని కోడుమూరు ఎంపీడీవో ఏసి రాముడు తెలియజేశారు అలాగే రాబోయే రెండునర నెలలు ఎగ్జామ్స్ కి సంసిద్ధంగా ఉండే విధంగా మీ పిల్లలను మీరు కూడా పర్యవేక్షణ చేయాల్సిన అవసరం కచ్చితంగా ఉంటుందని దానికి సరైన ప్రణాళికలను తల్లిదండ్రులు తయారు చేసుకుని పిల్లల్ని చదివించాలని వారి సందర్భంగా తెలియజేశారు అదేవిధంగా ఉపాధ్యాయులు కూడా సబ్జెక్టు వారీగా వారి వారికి అప్పుజెప్పినటువంటి సమయంలో హాజరవుతున్నారు వారి యొక్క సేవలను వినియోగించుకొని పిల్లల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రులు కూడా ప్రధాన పాత్ర పోషించి పాఠశాలను సందర్శించి మీ అబ్బాయి అమ్మాయి యొక్క చదువు పట్ల టీచర్స్ ని అడిగి తెలుసుకునే బాధ్యత తల్లిదండ్రులకు ఉంటుందని వారి సందర్భంగా తెలియజేశారు అలాగే ప్రభుత్వము పెట్టినటువంటి రెమిడీయల్ క్లాసెస్ విధానము పిల్లలందరూ ఖచ్చితంగా వినియేగించుకోవాలి సమయానికి పాఠశాలలకు వచ్చే విధంగా తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకోవాలని తెలియజేశారు వారు మండలంలోని జివిఆర్ గవర్నమెంట్ హై స్కూల్ కి ప్రత్యేక అధికారిగా కలెక్టర్ నియమించడం వల్ల వారంలో కనీసం మూడుసార్లు ఆ పాఠశాలను సందర్శించి పిల్లలకు సమయపాలన పాటించమని శ్రద్ధగా చదువుకోమని ఉత్తీర్ణత శాతం పెంచుకొని మంచి మార్కులతో పాస్ అవ్వాలని వారు విద్యార్థినీ విద్యార్థులకు తగు సూచనలు అందించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందము మరియు విద్యార్థులు పాల్గొన్నారు

# ఆదోని జిల్లా సాధించేవరకు పోరాటం ఆగదు

– రిలే దీక్షల్లో పెద్దహోతూర్ గ్రామ రైతులు.




( ఆలూరు మనగళం ):ఆదోని జిల్లా చేసే వరకు పోరాటం ఆగదని ఆలూరు జేఏసీ నాయకులు కత్తి రామాంజనేయులు, భూపేష్ తేల్చి చెప్పారు. ఆదోని జిల్లా సాధన కోసం ఆలూరు బస్టాండ్ లో జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు సోమవారం 18 రోజు కు చేరుకున్నాయి. ఈ దీక్షలకు పెద్ద హోతూర్ గ్రామ ప్రజలు రైతులు మేము సైతం అంటూ దీక్షలో కూర్చున్నారు. హాలో ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆదోని జిల్లా గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షల్లో లక్ష్మన్న, చిన్న యాదవ్, హోతురప్ప, నాగేంద్ర, రాజు,చిన్న మారెప్ప, వెంకటేశ్వర్లు, శ్రీధర్, కుమార్, చిన్న రాముడు, ఉచ్చిరప్పతో పాటు గ్రామ ప్రజలు కూర్చున్నారు వీరికి జె ఏ సి నాయకులు ఎల్లప్ప, చంద్రకాంత్ రెడ్డి, పుల రామాంజనేయులు, చాపల గోపాల్, ముని స్వామి సంఘీభావం ప్రకటించారు.

# నూతన క్యాలెండర్ లను ఆవిష్కరించిన గుమ్మనూరు నారాయణ, బీజేపీ కమలమ్మ దంపతులు.

( ఆలూరు మనగళం ):ఆలూరు నియోజకవర్గం, చిప్పగిరి మండలం, గుమ్మనూరు గ్రామంలో ఆలూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ మరియు బిజెపి నాయకురాలు గుమ్మనూరు కమలమ్మ దంపతులను మర్యాదపూర్వకంగా కలిసిన హెచ్ఎంటీవీ మీడియా ప్రతినిధులు. గుమ్మనూరు నారాయణ మరియు బిజెపి నాయకురాలు గుమ్మనూరు కమలమ్మ దంపతులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం హెచ్ఎంటీవీ నూతన క్యాలెండర్ లను గుమ్మనూరు నారాయణ మరియు గుమ్మనూరు కమలమ్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం గుమ్మనూరు నారాయణ మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గం పోలీస్ శాఖ మరియు రెవిన్యూ అధికారులకు, కూటమి నాయకులకు, బిజెపి నాయకులకు, గుమ్మనూరు ఫ్యామిలీ అభిమానులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మీడియా ప్రతినిధులు మరియు గుమ్మనూరు నారాయణ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నష్టాలతోనే ముగిసిన దేశీయ సూచీలు





ముంబై డిసెంబర్ 29, 2025 , మనగళం : దేశీయ షేర్ మార్కెట్‌లో సోమవారం ఆరంభంలో కనిపించిన లాభాలు మధ్యాహ్నం తర్వాత ఆవిరైపోయాయి. విదేశీ మదుపర్ల అమ్మకాలు, ముడి చమురు ధరల పెరుగుదల, సంవత్సరాంతం కావడంతో పెట్టుబడిదారుల అప్రమత్త వైఖరి కలిసి మార్కెట్‌పై భారంగా మారాయి. అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు కూడా దేశీయ సూచీలను వెనక్కి లాగాయి. దీంతో రోజు చివరికి ప్రధాన సూచీలు నష్టాలతోనే ముగిశాయి.గత సెషన్ ముగింపు స్థాయితో పోలిస్తే ఉదయం దాదాపు మార్పు లేకుండా మొదలైన ప్రధాన సూచీ, మధ్యాహ్నం వరకు లాభాల్లోనే కదలాడింది. ఒక దశలో 250 పాయింట్లకు పైగా లాభపడి రోజులో గరిష్ట స్థాయిని తాకింది. అయితే మధ్యాహ్నం తర్వాత అమ్మకాలు ఊపందుకోవడంతో మార్కెట్ దిశ మారింది. చివరకు ప్రధాన సూచీ 345 పాయింట్లు నష్టపోయి 84,695 వద్ద ముగిసింది. మరో ప్రధాన సూచీ కూడా ఇదే బాటలో సాగి 100 పాయింట్లు కోల్పోయి 25,942 వద్ద స్థిరపడింది. దీంతో మళ్లీ 26,000 దిగువకు జారింది.విదేశీ మదుపర్లు గత సెషన్‌లో రూ.317 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. సంవత్సరాంతం కావడంతో కొత్త పెట్టుబడులపై మదుపర్లు వెనకడుగు వేశారు. ఇదే సమయంలో ముడి చమురు ధరలు పెరగడం మార్కెట్ భావోద్వేగాలను మరింత దెబ్బతీసింది.కొన్ని నిర్మాణ, ఉక్కు, వినియోగ వస్తువుల రంగాలకు చెందిన షేర్లు లాభాల్లో నిలిచినా, రైల్వే, సాంకేతిక, గనుల రంగాలకు చెందిన షేర్లు నష్టాలను చవిచూశాయి. బ్యాంకింగ్ రంగ సూచీ స్వల్ప నష్టంతో ముగియగా, మధ్య తరహా షేర్ల సూచీ భారీగా పడిపోయింది. రూపాయి మారకం విలువ కూడా డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలహీనపడింది.మొత్తంగా చూస్తే, ఆరంభంలో ఆశ చూపించిన మార్కెట్ చివరకు అమ్మకాల ఒత్తిడికి తలొగ్గి నష్టాలతో ముగియడం పెట్టుబడిదారుల్లో నిరాశను కలిగించింది.

# గ్రీట్ విత్ గ్రీన్’ పోస్టర్లను ఆవిష్కరించినరెడ్ క్రాస్ అధ్యక్షురాలు,

– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

మనగళం, నంద్యాల రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రూపొందించిన ‘గ్రీట్ విత్ గ్రీన్’ పోస్టర్లను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలను బొకేలు, కేకులు వంటి సంప్రదాయ పద్ధతులకు బదులుగా మొక్కలు నాటి, విద్యాసామగ్రి అందజేసే విధంగా జరుపుకోవాలని జిల్లాలోని అధికారులకు పిలుపునిచ్చారు. ఇటువంటి కార్యక్రమాలు పర్యావరణ పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతను కూడా పెంపొందిస్తాయని ఆమె తెలిపారు. జూనియర్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ అధికారుల నుండి సేకరించిన మొక్కలను ప్రభుత్వ విద్యా సంస్థల్లో నాటడం, అలాగే సేకరించిన విద్యాసామగ్రిని వసతి గృహాలలోని విద్యార్థులకు పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, సెక్రటరీ, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి నాగేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్మాన్ భాష, అటవీ శాఖ అధికారి (డీఎఫ్ఓ) అబ్దుల్ సమీతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.




# గూడూరు మండలంలోని పొన్నగల్లు గ్రామంలో వెలిసిన అయ్యప్ప కొండ మిన్నల స్వామి ఉరుసు


మన గలము గూడూరు: కర్నూలు జిల్లా గూడూరు మండలంలోని పొన్నగల్లు గ్రామంలో వెలిసిన అయ్యప్ప కొండ మిన్నల స్వామి ఉరుసు సందర్భంగా గూడూరు చైతన్య సేవా సంస్థ యూత్ వాళ్ళు తమ వంతు భాగంగా దర్శనానికి వచ్చే భక్తులకు దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమం గత 29 సంవత్సరాల క్రితం నుండి జరుగుతున్నామని వెంకటేశ్వర్లు మాజీ జడ్పిటిసి సభ్యులు వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బజారి, విజయుడు, రామాంజి,చైతన్య సభ్యులు పి కృష్ణ మనోహర్, ఆచారి, మేకల గిడ్డయ్య,మరియు ఈశ్వర్, రామగిరి, వెంకటేష్ తదితరులు ఉన్నారు.



# కోడుమూరు మండలం గోరంట్ల నందు శ్రీశ్రీశ్రీ లక్ష్మీ మాధవ స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లాలోని కోడుమూరు మండలంలో గల గోరంట్ల గ్రామంలో వైకుంఠ ఏకాదశి మంగళవారం రోజున ఎంతో ఘనంగా పూజలునిర్వహిస్తారు ఈ దేవాలయము పురాతనమైన ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీ మాధవ స్వామి దేవాలయం కలదు ఆ దేవాలయం నందు వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం గుండా భక్తులను అనుమతిస్తారు వైకుంఠ ఏకాదశి పండుగను పురస్కరించుకొని ఆలయంలో అమ్మవారికి అయ్యవారికి విశేష పూజలు అభిషేకము మరియు అర్చనలు ఘనంగా జరుగుతాయి కోడుమూరు నియోజకవర్గంలోని ప్రజలంతా ఈ వైకుంఠ ఏకాదశి రోజున శ్రీశ్రీశ్రీ లక్ష్మీ మాధవస్వామి వారిని ఉత్తర ద్వారం ద్వారా వెళ్లి దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు పొందిన తర్వాత స్వామివారి ఆశీస్సులతో గోరంట్ల గ్రామ సర్పంచ్ అయిన ఎస్. బి బాలకృష్ణ ఆధ్వర్యంలో వారి స్నేహితులైన సి గిడ్డయ్య జె శ్రీనివాసులు కే ఈశ్వరయ్య బృందం కలిసి అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు వచ్చిన భక్తులంతా చక్కగా వారు ఏర్పాటు చేసిన అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించి అమ్మవారి అయ్యవారి ఆశీస్సులు పొందాలని వారు మనస్ఫూర్తిగా భక్తులను కోరుకున్నారు వైకుంఠ ఏకాదశి రోజున గోరంట్ల శ్రీశ్రీశ్రీ లక్ష్మి మాధవ స్వామి ఆలయం నందు ప్రతి ఏడాది వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో వందలాది భక్తులు పాల్గొంటారు





మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

## సంవత్సరం చివర... ప్రజల జీవితాలు మెరుగయ్యాయా?


సంవత్సరం చివరకు వచ్చేసరికి ప్రభుత్వాలు తమ పాలన విజయవంతమైందని ప్రకటించుకునే దశలోకి వెళ్తాయి. అభివృద్ధి గణాంకాలు, వృద్ధి శాతాలు, ఖర్చయిన కోట్ల రూపాయల లెక్కలు ప్రజల ముందుంచుతారు. అధికారిక నివేదికల్లో దేశం ముందుకు దూసుకుపోతున్నట్టు, రాష్ట్రం మార్పు బాటలో నడుస్తున్నట్టు చిత్రీకరిస్తారు. కానీ ఈ లెక్కలన్నీ ప్రజల జీవితం ఎంతవరకు తాకాయన్న ప్రశ్నకు మాత్రం స్పష్టమైన సమాధానం కనిపించడం లేదు. సంఖ్యలు మాట్లాడుతున్నాయి గానీ, ప్రజల కళ్లలో కనిపించే వాస్తవం మాత్రం భిన్నంగా ఉంది.నిత్యజీవితంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ధరల పెరుగుదలతో సాధారణ కుటుంబాల బడ్జెట్ గందరగోళంగా మారింది. కూరగాయల నుంచి విద్యుత్ బిల్లుల వరకు ప్రతిదీ భారంగా మారింది. ఆదాయం పెరగకపోయినా ఖర్చులు మాత్రం ఆగడం లేదు. మధ్యతరగతి కుటుంబం నెలాఖరు ఎలా గడపాలన్న ఆందోళనలో చిక్కుకుంటోంది. ప్రభుత్వ లెక్కల్లో అభివృద్ధి కనిపిస్తున్నా, ఇంటి గడప దాటితే ప్రజలకు కనిపించేది ఒత్తిడి మాత్రమే.గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత కఠినంగా ఉంది. సాగు ఖర్చులు పెరుగుతున్నాయి, విత్తనాలు, ఎరువులు, కూలీల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కానీ పంటకు గిట్టుబాటు ధర మాత్రం రైతుకు భరోసా ఇవ్వడం లేదు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతు భవిష్యత్తుపై భయంతో జీవిస్తున్నాడు. నీళ్లు, ప్రాజెక్టులు, సాగునీటి హామీలు సంవత్సరాలుగా వినిపిస్తున్నా, క్షేత్రస్థాయిలో సమస్యలు అలాగే ఉన్నాయి. పాలకుల మాటలు రైతు జీవితంలో స్థిరత్వాన్ని తీసుకురాలేకపోతున్నాయి.పట్టణాల్లో యువత పరిస్థితి కూడా ఆశాజనకంగా లేదు. ఉద్యోగాల ప్రకటనలు వస్తున్నా, అవి అందరికీ అవకాశాలు కల్పించలేకపోతున్నాయి. చదువు పూర్తయ్యాక ఉద్యోగం దొరకకపోవడం అనేక కుటుంబాల్లో నిరాశను నింపుతోంది. ప్రైవేట్ రంగంలో ఉద్యోగ భద్రత లేకపోవడం, తక్కువ జీతాలు, పెరుగుతున్న జీవన వ్యయం యువతను మానసిక ఒత్తిడికి గురిచేస్తోంది. ప్రభుత్వ లెక్కల్లో ఉద్యోగాల సృష్టి కనిపించినా, యువత అనుభవంలో మాత్రం నిరీక్షణే మిగులుతోంది.సంక్షేమ పథకాలు అనేక కుటుంబాలకు తాత్కాలిక ఊరటనిచ్చిన మాట వాస్తవమే. కానీ అవే శాశ్వత పరిష్కారం కాదన్న విషయాన్ని పాలకులు అంగీకరించాల్సిన అవసరం ఉంది. ఒకసారి ఇచ్చే ఆర్థిక సహాయం జీవన సమస్యలను పూర్తిగా తొలగించదు. స్థిర ఉపాధి, నాణ్యమైన విద్య, అందుబాటులో ఉన్న వైద్యం లేకపోతే ప్రజల జీవితం మారదు. సంక్షేమాన్ని అభివృద్ధిగా చూపించే ప్రయత్నం ప్రజల ఆలోచనలను తాత్కాలికంగా మళ్లించవచ్చు గానీ, వాస్తవాన్ని దాచలేం.మహిళల భద్రత, సామాజిక న్యాయం, ఆరోగ్య వ్యవస్థ వంటి అంశాల్లో కూడా ప్రజలకు పూర్తి నమ్మకం కలగడం లేదు. చట్టాలు ఉన్నా అమలు లోపిస్తోంది. ఆస్పత్రులు ఉన్నా సేవ అందుబాటులో లేదన్న ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. విద్యా వ్యవస్థలో ఖర్చులు పెరుగుతున్నాయి కానీ నాణ్యతపై ప్రశ్నలు మిగులుతున్నాయి. పాలకుల లెక్కల్లో ఈ రంగాల్లో పురోగతి కనిపిస్తున్నా, ప్రజల అనుభవం మాత్రం ఇంకా సంతృప్తికరంగా లేదు.ఈ ఏడాది ముగింపు ప్రజలను ఒక కీలక ప్రశ్న ఎదుట నిలబెడుతోంది. పాలకుల లెక్కల ప్రకారం ఇది విజయవంతమైన సంవత్సరం కావచ్చు. కానీ ప్రజల నిజాల్లో భద్రత, ఉపాధి, గౌరవం ఇంకా పూర్తిగా సాధించబడలేదు. ప్రజల జీవితాల్లో కనిపించే మార్పే పాలన విజయానికి నిజమైన కొలమానం. గణాంకాల మెరుపు కన్నా నేలమీద నిజం బలంగా ఉండాలి.కొత్త సంవత్సరం కొత్త ఆశలతో వస్తోంది. కానీ ఆ ఆశలు నిలవాలంటే పాలకులు లెక్కలు చెప్పడానికే పరిమితం కాకుండా ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకురావాలి. మాటలు కాదు, చర్యలు కావాలి. సంఖ్యలు కాదు, అనుభవాలు మాట్లాడాలి. అప్పుడే ప్రజలు నిజంగా "మన జీవితం మెరుగైంది" అని చెప్పగలుగుతారు. సంవత్సరం చివరకు వచ్చేసరికి ప్రభుత్వాలు తమ పాలన విజయవంతమైందని ప్రకటించుకునే దశలోకి వెళ్తాయి. అభివృద్ధి గణాంకాలు, వృద్ధి శాతాలు, ఖర్చయిన కోట్ల రూపాయల లెక్కలు ప్రజల ముందుంచుతారు. అధికారిక నివేదికల్లో దేశం ముందుకు దూసుకుపోతున్నట్టు, రాష్ట్రం మార్పు బాటలో నడుస్తున్నట్టు చిత్రీకరిస్తారు. కానీ ఈ లెక్కలన్నీ ప్రజల జీవితం ఎంతవరకు తాకాయన్న ప్రశ్నకు మాత్రం స్పష్టమైన సమాధానం కనిపించడం లేదు. సంఖ్యలు మాట్లాడుతున్నాయి గానీ, ప్రజల కళ్లలో కనిపించే వాస్తవం మాత్రం భిన్నంగా ఉంది.నిత్యజీవితంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ధరల పెరుగుదలతో సాధారణ కుటుంబాల బడ్జెట్ గందరగోళంగా మారింది. కూరగాయల నుంచి విద్యుత్ బిల్లుల వరకు ప్రతిదీ భారంగా మారింది. ఆదాయం పెరగకపోయినా ఖర్చులు మాత్రం ఆగడం లేదు. మధ్యతరగతి కుటుంబం నెలాఖరు ఎలా గడపాలన్న ఆందోళనలో చిక్కుకుంటోంది. ప్రభుత్వ లెక్కల్లో అభివృద్ధి కనిపిస్తున్నా, ఇంటి గడప దాటితే ప్రజలకు కనిపించేది ఒత్తిడి మాత్రమే.గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత కఠినంగా ఉంది. సాగు ఖర్చులు పెరుగుతున్నాయి, విత్తనాలు, ఎరువులు, కూలీల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కానీ పంటకు గిట్టుబాటు ధర మాత్రం రైతుకు భరోసా ఇవ్వడం లేదు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతు భవిష్యత్తుపై భయంతో జీవిస్తున్నాడు. నీళ్లు, ప్రాజెక్టులు, సాగునీటి హామీలు సంవత్సరాలుగా వినిపిస్తున్నా, క్షేత్రస్థాయిలో సమస్యలు అలాగే ఉన్నాయి. పాలకుల మాటలు రైతు జీవితంలో స్థిరత్వాన్ని తీసుకురాలేకపోతున్నాయి.పట్టణాల్లో యువత పరిస్థితి కూడా ఆశాజనకంగా లేదు. ఉద్యోగాల ప్రకటనలు వస్తున్నా, అవి అందరికీ అవకాశాలు కల్పించలేకపోతున్నాయి. చదువు పూర్తయ్యాక ఉద్యోగం దొరకకపోవడం అనేక కుటుంబాల్లో నిరాశను నింపుతోంది. ప్రైవేట్ రంగంలో ఉద్యోగ భద్రత లేకపోవడం, తక్కువ జీతాలు, పెరుగుతున్న జీవన వ్యయం యువతను మానసిక ఒత్తిడికి గురిచేస్తోంది. ప్రభుత్వ లెక్కల్లో ఉద్యోగాల సృష్టి కనిపించినా, యువత అనుభవంలో మాత్రం నిరీక్షణే మిగులుతోంది.నిలబెడుతోంది. పాలకుల లెక్కల ప్రకారం ఇది విజయవంతమైన సంవత్సరం కావచ్చు. కానీ ప్రజల నిజాల్లో భద్రత, ఉపాధి, గౌరవం ఇంకా పూర్తిగా సాధించబడలేదు. ప్రజల జీవితాల్లో కనిపించే మార్పే పాలన విజయానికి నిజమైన కొలమానం. గణాంకాల మెరుపు కన్నా నేలమీద నిజం బలంగా ఉండాలి.కొత్త సంవత్సరం కొత్త ఆశలతో వస్తోంది. కానీ ఆ ఆశలు నిలవాలంటే పాలకులు లెక్కలు చెప్పడానికే పరిమితం కాకుండా ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకురావాలి. మాటలు కాదు, చర్యలు కావాలి. సంఖ్యలు కాదు, అనుభవాలు మాట్లాడాలి. అప్పుడే ప్రజలు నిజంగా "మన జీవితం మెరుగైంది" అని చెప్పగలుగుతారు.

## పురాతన శిలాశాసనాన్ని స్వాధీనం చేసుకోవాలి బిసి రాజారెడ్డి

మన గళం బనగానపల్లె : శాలివాహన శకం 1522వ సంవత్సరం చెందిన పురాతన శిలాశాసనాన్ని పురావస్తు శాఖ అధికారులు స్వాధీనం చేసుకోవాలని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి కోరారు తాను బనగానపల్లె పట్టణ సర్పంచ్ గా పనిచేసిన సమయంలో ఈ పురాతన శిలా శాసనాన్ని సేకరించి గ్రామపంచాయతీ ఆఫీస్ పక్కన ఏర్పాటు చేసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పార్క్ నందు ప్రతిష్ఠించి దానిని తెలుగులో అనువదించడం జరిగిందన్నారు ఈ శాసనాన్ని పురావస్తు శాఖ అధికారులు స్వాధీనం చేసుకొని మ్యూజియంలో ఏర్పాటు చేయాలని రెండుసార్లు ఉత్తరం ద్వారా వారికి సమాచారం అందించిన ఎటువంటి స్పందన లేదన్నారు ఇప్పటికైనా వారు స్పందించి ఈ పురాతన శిలాశాసనాన్ని స్వాధీనం చేసుకొని భద్రపరచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు క్రీస్తు శకం 1600 సంవత్సరం పెనుగొండ సింహాసనాధిపతులు వెంకటపతి దేవ మహారాయుల గారి సామంతులు అవుకు సంస్థానాధిపతులు తిమ్మరాజయ్య గారి పుత్రుడు బావ రాజు గారి బనగానపల్లె చెన్నకేశవ పెరుమాళ్ళ దివ్య శ్రీ పాద పద్మములకు సమర్పించిన భూ శాసన క్రమము బనగానపల్లె పరిధిలోని బత్తులూరుపాడు గ్రామము చతుర్దిశలకు లోనైన 13 పుట్ల ముత్తుం చేను అష్ట భోగములకు ( ఆలయ ధూప దీప నైవేద్యములకు) ఉభయమిచ్చిరి దీనికి ఆధారమైన ప్రాచీన శిలాశాసనం లోని అక్షరాలు తులు భాషగా తెలియబడుచున్నది అని తెలిపారు అలాగే యనకండ్ల గ్రామము గత కొన్ని వందల సంవత్సరాల కిందట వెంనకండ్ల గా పిలిచేవారని కాలక్రమంలో యనకండ్ల అంటున్నారన్నారు ఇప్పటికైనా పురావస్తు శాఖ వారు స్పందించి పురాతన శిలాశాసనాలను భద్రపరచాలని ఆయన కోరారు.



## నేడే ముక్కోటి ఏకాదశి !!



మన గళం అవుకు : నంద్యాల జిల్లా అవుకు పట్టణంలో వెలసిన శ్రీ భూలక్ష్మి లక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి ఆలయం నందు మంగళవారం ముక్కోటి ఏకాదశి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయానికి వివిధ రకాల పుష్పాలతో స్వామి వారి ఉత్సవమూర్తులను అలంకరింపజేయడం జరుగుతుందన్నారు. భక్తులకు స్వామి అమ్మవార్ల ను ఉత్తర ద్వార దర్శనం కలిగిస్తున్నట్లు తెలిపారు. కావున భక్తులు విరివిగా పాల్గొని స్వామి అమ్మవార్ల కృపాకటాక్షాలు పొందాలని కోరుకున్నట్లు తెలిపారు.



## యాగంటి క్షేత్రము హుండీ లెక్కింపు



మన గళం బనగానపల్లె : నంద్యాల జిల్లా బనగానపల్లె మండలంలోని ప్రముఖ దైవ క్షేత్రమైన శ్రీ యాగంటి ఉమామహేశ్వర స్వామి వారి దేవస్థానము నందు సోమవారం హుండీ లెక్కించడం జరిగింది. ఈ సందర్భంగా వెలుగోడు సమూహ దేవస్థానాల ఈవో జనార్ధన్ మాట్లాడుతూ 80 రోజులకు గానునగదు:- రూ. 29,58,535/- బంగారం:35గ్రాములుమరియు వెండి:160గ్రాములు అని తెలిపారు. బండి మౌళీశ్వర రెడ్డి ,ఎం.భరతుడు, పి.శ్రీరాములు, రామశేఖర్ ,అర్చకులు ఆలయ సిబ్బంది శ్రీ రామ సేవా సమితి సేవకులు పోలీసు అధికారులు ూూ+దీ బ్యాంకు సిబ్బంది ఈ లెక్కింపులో పాల్గొన్నారు .



## ఇంటివద్దే పెరటి తోటలు ఏర్పాటు చేసుకోండి.. నాగరాజు

మన గళం అవుకు మహిళలు ఇంటి వద్దనే పెరటి తోట ఏర్పాటు చేసుకోవాలని ఎస్ ఈ ఆర్ పి అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ నాగరాజు సోమవారం అన్నారు.కోయిలకుంట్ల డివిజన్‌లోని మండల సమాఖ్య కార్యాలయం అవుకు నందు సోమవారం వ్యవసాయ శాఖ, ూజుౡా మరియు అనుబంధ శాఖలతో కలిసి ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారీ కలిమున్నిసా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలు, ఖర్చుల తగ్గింపు, నేల సారవంతం పెంపు మరియు దీర్ఘకాలిక ఆదాయ అవకాశాల గురించి వివరించారు.ూజుౡా అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ నాగరాజు మాట్లాడుతూ పొలం ఉన్న ప్రతి మహిళ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి మెరుగైన ఆదాయం పొందే దిశగా ముందుకు రావాలని సూచించారు.ప్రకృతి వ్యవసాయ విభాగానికి చెందిన చీఖీూ రామకృష్ణ ప్రకృతి వ్యవసాయం అమలు విధానాలు మరియు నేషనల్ మిషన్ ఫర్ నేచురల్ ఫామింగ్ (చీవీచీఖీ) గురించి వివరించారు. అలాగే ప్రకృతి వ్యవసాయం అమలవుతున్న గ్రామాలలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ రూపొందించేందుకు ఈ సమన్వయ సమావేశం నిర్వహించబడిందని తెలిపారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా గ్రామస్థాయిలో 3 రోజుల క్యాంపెయిన్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ సమావేశంలో ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బందితో పాటు వ్యవసాయ శాఖ, ూజుౡా మరియు ఇతర అనుబంధ శాఖల అధికారులు ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ అమలులో భాగంగా ఎంపికైన గ్రామాలలో





గ్రామసభలు, ర్యాలీలు మరియు సంఘాల వారీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రణాళికను పూర్తిస్థాయిలో అమలు చేయాలని నిర్ణయించారు.అలాగే, అన్ని శాఖల అధికారులు గ్రామస్థాయిలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమన్వయం చేసుకొని ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌ను విజయవంతంగా పూర్తి చేయాలని సమావేశంలో స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వి ఏ ఏ ఎస్ , వి హెచ్ ఎ ఎస్ , మండల అధ్యక్షురాలు, ఏం ఎస్ ఓ బి ఎస్,ఞూదీం, ఞూాం, మీ, ఖీమీం మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## మార్కాపురం జిల్లాగా ఏర్పాటు కేబినెట్ ఆమోదం

మన గళం పెద్ద దోర్నాల, డిసెంబర్ 29 :మార్కాపురాన్ని నూతన జిల్లాగా ఏర్పాటు చేస్తూ దొనకొండ, కురిచేడు మండలాలను మార్కాపురం జిల్లాలో కలపాలని ఆంధ్రప్రదేశ్ కేబినెట్ ఆమోదం తెలపడం పట్ల దోర్నాల భారతీయ జనతా పార్టీ అధ్యక్షురాలు సురవరం మల్లీశ్వరి హర్షం వ్యక్తం చేశారు.ఈ కీలక నిర్ణయానికి సహకరించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌లకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మార్కాపురం పరిధిలోని ఎర్రగొండపాలెం, దోర్నాల తదితర ప్రాంతాలు ఇప్పటివరకు వెనుకబడిన పశ్చిమ ప్రాంతాలుగా ఉండిపోయాయని, నూతన జిల్లాగా ఏర్పాటు కావడంతో ఈ ప్రాంతాలకు సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.పరిశ్రమల స్థాపన, మౌలిక వసతుల అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె కోరారు.మార్కాపురం జిల్లా ఏర్పాటు నిర్ణయం ఈ ప్రాంత ప్రజల దీర్ఘకాలిక ఆశయాన్ని నెరవేర్చిందని, భవిష్యత్తులో అభివృద్ధికి కొత్త దారులు తెరవనుందని సురవరం మల్లీశ్వరి ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇట్లు
మీ సురవరం మల్లీశ్వరి
దోర్నాల మండల బీజేపీ పార్టీ అధ్యక్షురాలు
మరియు ూవీజ డైరెక్టర్, వై పాలెం



# ప్రజా సమస్యలకు ఖచ్చితమైన పరిష్కార మార్గం చూపాలి

**– రెవెన్యూ అర్జీలు మినహా పీజీఆర్ఎస్‌కు 151 దరఖాస్తులుట – జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా**



మనగళం, నంద్యాల ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి అర్జీకి ఖచ్చితమైన పరిష్కార మార్గం చూపాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన రెవిన్యూ అర్జీదారుల మినహా 151 మంది దరఖాస్తుదారుల నుండి నుంచి జిల్లా కలెక్టర్ నేరుగా అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి స్పష్టమైన, ఖచ్చితమైన పరిష్కార మార్గాలు చూపాలని అధికారులకు సూచించారు. అర్జీదారుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, అధికారులు మరింత చొరవతో ప్రతి దరఖాస్తును నాణ్యతతో పాటు వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీల పరిష్కార ప్రక్రియను రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా జిల్లాలను సందర్శించి పర్యవేక్షించనున్న దృష్ట్యా, అధికారులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. రీ–ఓపెన్ అయిన దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఏలో ఉన్న అర్జీలు, వీఐపీ గ్రీవెన్స్‌లను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఆడిట్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్ణీత కాలపరిమితిలోగా వాటిని క్లియర్ చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఆళ్లగడ్డ మండలం, మెట్టపల్లె గ్రామానికి చెందిన కె. లక్ష్మి నరసయ్య (వయస్సు 62 సంవత్సరాలు) తనకు వృద్ధాప్య పెన్షన్ మంజూరు కాలేదని పేర్కొంటూ, అర్హతను పరిగణనలోకి తీసుకొని పెన్షన్ మంజూరుకు తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. నంద్యాల మండలం, మూలసాగరం ప్రాంతానికి చెందిన ఆర్. లక్ష్మిరెడ్డి తనకు సర్వే నెం. 10, 11లలో కలిపి 5 ఎకరాల భూమి ఉన్నదని, అయితే పొరుగు భూముల యజమానులు తన పొలానికి వెళ్లేందుకు రస్తా ఇవ్వడం లేదని పేర్కొంటూ, సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. దొర్నిపాడు మండలం, రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఎం. రాముడు వైకల్యంతో బాధపడుతున్నారని పేర్కొంటూ, తనకు వికలాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు అందజేశారు. ఆళ్లగడ్డ మండలం, మిట్టపల్లి గ్రామానికి చెందిన ఎం. ఓబులమ్మ తన భర్త అనారోగ్య కారణంగా మృతి చెందినట్లు తెలియజేస్తూ, తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు.

# కోల్స్ చర్చ్ క్రిస్మస్ షటిల్ బ్యాడ్ మెంటన్ పోటీలు ప్రారంభం

మనగళం, నంద్యాల క్రిస్మస్ పర్వ దినాన్ని పురస్కరించుకొని కోల్స్ చర్చ్ వారు నిర్వహిస్తున్న క్రీడా పోటీల మూడవరోజున స్థానిక ఋూూ ఇండోర్ స్టేడియం నందు షటిల్ బ్యాడ్ మెంటన్ పోటీలను చర్చి అధ్యక్ష కార్యదర్శులు సొలోమోన్ గారు అనిల్ నాథ్ ,క్రీడల కన్వీనర్ విజయకుమార్ గారు ,పాలు సుధాకర్లు క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించిరి. గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తితో పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టరు రెవ.ఆర్. అనిల్ సామ్యూల్ గారు,రెవ. జీవన్ రావు ,గారు క్రిస్మస్ కమిటీ నిర్వాహక చైర్మన్ సుధీర్ కుమార్ రెఫరీసుగా విన్సెంట్ గాంధీ, భీముడు,చిన్న, నరేష్, వ్యవహరించిరి. బాల బాలికల స్త్రీ పురుషులకు సింగిల్సు డబల్సు నందు పోటీలను నిర్వహించరి. విజేతలకు కొత్త సంవత్సరం రోజు రాత్రి 7 గంటలకు బహుమతులు బహుకరించబడనని పాలు సుధాకర్ తెలిపారు.



# విచారణ జరిపి ఫిర్యాదుదారులకు చట్ట పరిదిలో న్యాయం చేస్తాం

**– జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్**

మనగళం, నంద్యాల నంద్యాల జిల్లా బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ( 29-12-2025) నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఫిర్యాదిదారుల నుంచి 75 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ స్వయంగా మాట్లాడి ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు.తాను జనవరి 2025 నుండి అక్టోబర్ వరకు నంద్యాల పట్టణంలోని ఒక ప్రైవేటు జూనియర్ కళాశాలలో పనిచేశాను. నాకు ఇంతవరకు జీతం ఇవ్వకపోగా కళాశాల ప్రిన్సిపల్ సుబ్బయ్య అనుచితంగా అమర్యాదగా ప్రవర్తిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడు.నాకు న్యాయం చేయండని మల్లికార్జునయ్య జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. నేను నర్సు గా పనిచేయుచున్నాను. నాకు బాలుగ్రం అనే వ్యక్తిగా 2019లో వివాహం జరిగింది. నాతో వివిధ ప్రవేట్ బ్యాంకులలో 30 లక్షలకు పైగా లోన్లు తీసుకుని నాతో సంతకాలు పెట్టించి నా జీతం నుండి ప్రతినెలా 28,000 జువీ× కట్టేలా మరియు వేరే అమ్మాయిలతో తిరుగుతూ నన్ను మోసం చేస్తున్నాడు.




ఆ డబ్బులు నన్ను కట్టమని శారీరకంగా మానసికంగా ప్రతిరోజు నన్ను వేధిస్తున్నాడు. నాకు న్యాయం చేయండని ఓ బాధితురాలు జిల్లా ఎస్పీ గారికి ఫిర్యాదు చేయడం జరిగింది.నాకు సంబంధించిన స్థలంలో గడ్డివాము, బర్రెల కొట్టం వేసి శ్రీనివాసులు, నరసింహుడు,వెంకటేశ్వర్లు అనువారు ఆక్రమించుకోవడం జరిగింది. తీసివేయమని చెప్పగా తీస్తామని తీయడం లేదు. నాపై దయవుంచి నాకు న్యాయం చేయండని బండిఆత్మకూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు. నేను వృద్ధుడను నాకు ఏ ఆధారము లేదు. నాకు ఇద్దరు కుమారులు పెద్ద కుమారుడు, కోడలు నా భార్యకు సంబంధించిన ఐదు తులాల బంగారం ఇవ్వడం లేదు వారిపై కఠిన చర్యలు తీసుకొని నా బంగారం ఇప్పించి న్యాయం చేయాలని నూనెపల్లె సాదిక్ నగర్ కు చెందిన బాదుల్లా జిల్లా ఎస్పీ ఫిర్యాదు చేశారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి

**– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

మనగళం, నంద్యాల జిల్లాలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను సంబంధిత శాఖల అధికారులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని శాఖలు కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించకపోతే, ఆ నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల ప్రతి శాఖ తమకు కేటాయించిన నిధులను సమర్థవంతంగా వినియోగించి అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రత్యేకంగా జల జీవన్ మిషన్, ప్రధానమంత్రి వికసిత్ భారత్ యోజన, కృషి వికాస్ యోజన, పోషణ్ అభియాన్, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, మిషన్ వాత్సల్య, త్రిషోన్నతి యోజన, పీఎంఏవై (అర్బన్), ప్రధానమంత్రి ఆది ఆదర్శ గ్రామ యోజన, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ



ఉపాధి హామీ పథకం తదితర కేంద్ర ప్రభుత్వ పథకాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని తెలిపారు. ప్రతి పథకానికి సంబంధించి మంజూరైన మొత్తం నిధులు, ఇప్పటివరకు ఖర్చు చేసిన మొత్తం, పథకం అమలవుతున్న ప్రాంతాలు, మిగిలి ఉన్న నిధులు, జరుగుతున్న అభివృద్ధి పనులు, పనులు పూర్తయ్యే గడువు వంటి వివరాలతో మంగళవారం ఉదయంలోగా క్లుప్తంగా నివేదికలను తమకు సమర్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# రెవెన్యూ క్లినిక్స్‌తో ప్రజలకు వేగవంతమైన న్యాయం

**– ఏడు రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 373 దరఖాస్తుల స్వీకరణ**
**– జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా**




మనగళం, నంద్యాల జిల్లాలో రెవెన్యూ సంబంధిత సమస్యలకు వేగవంతమైన పరిష్కారం అందించాలనే లక్ష్యంతో రెవెన్యూ యంత్రాంగం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణంలో ఏర్పాటు చేసిన ఏడు రెవెన్యూ క్లినిక్స్ ద్వారా ప్రజల నుండి మొత్తం 373 దరఖాస్తులను స్వీకరించామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణంలో నిర్వహించిన రెవెన్యూ క్లినిక్స్‌కు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో హాజరై తమ రెవెన్యూ సంబంధిత సమస్యలపై అర్జీలు సమర్పించారు. జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ డిఆర్ఓ రాము నాయక్, రెవిన్యూ డివిజనల్ అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, అన్నీ మండలాల తాసిల్దారులు రెవిన్యూ క్లినిక్స్‌లో ఉత్సాహంగా పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును సంబంధిత రెవెన్యూ డెస్క్‌లలో నమోదు చేసి, త్వరితగతిన పరిష్కరించేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. రెవెన్యూ శాఖ అందిస్తున్న సేవల పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకం మరింత పెంచి, సంతృప్తి స్థాయిని మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమాన్ని అమలులోకి తీసుకువచ్చిందన్నారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా ప్రజలకు నేరుగా సేవలు అందించడం వల్ల సమస్యల పరిష్కారం మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా జరుగుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఏడు రెవెన్యూ క్లినిక్స్ ద్వారా స్వీకరించిన 373 దరఖాస్తులకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...రెవిన్యూ, గ్రామ, వార్డు సచివాలయ సేవలకు సంబంధించిన అర్జీలు – 9, అడంగల్ సవరణలకు సంబంధించిన అర్జీలు – 106, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22–ఎ భూముల సంబంధించిన అర్జీలు – 65, అసైన్డ్ భూములు, భూఆక్రమణలకు సంబంధించిన అర్జీలు – 65, రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్ఓఆర్‌కు సంబంధించిన అర్జీలు – 33, సర్వే, రీ–సర్వేకు సంబంధించిన అర్జీలు – 63, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించిన అర్జీలు –32 స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. స్వీకరించిన సమస్యలను త్వరితగరిత్తిన పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి రెవెన్యూ క్లినిక్స్‌ను నిర్వహించి ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

# ఈనెల 31వ తేదీనే అవ్వ తాతలకు పెన్షన్లు పంపిణీ

**– చెత్త సేకరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలి**
**– గ్యాస్ డెలివరీ బాయ్స్ బిల్లులో ఉన్న రేటు కంటే అధిక డబ్బులు వసూలు చేయరాదు**
**– డీలర్లు రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి**
**– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**




మనగళం, నంద్యాల డిసెంబర్ 31వ తేదీన పెన్షన్ దారులకు ఇంటింటికి వెళ్లి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పలు అంశాలపై ఆర్డీవోలు, తహసిల్దార్ లు, ఎంపీడీవోల తో వీడియో కాన్ఫరెన్స్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ డిసెంబర్ 31వ తేదీన జిల్లాలో ఉన్న అర్హులందరికీ వంద శాతం పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. పెన్షన్ల పంపిణీలో ఎటువంటి సమస్యలు తలెత్తకూడదని పెన్షన్ పంపినదారులు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వారితో మర్యాదపూర్వకంగా మాట్లాడి పెన్షన్లు అందజేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్ 31వ తేదీనే పెన్షన్ దారులకు పెన్షన్లు పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. పెన్షన్ల పంపిణీ పై పెన్షన్ దారుల నుండి ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతోందని లబ్ధిదారుల నుండి ఎటువంటి ఫిర్యాదులు రాకూడదన్నారు. పెన్షన్ పంపిణీ చేసే సమయంలో లబ్ధిదారుల నుండి డబ్బులు వసూలు చేయకూడదన్నారు. పెన్షన్ల పంపిణీ పై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు.మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. చెత్త సేకరణలో పారిశుధ్య కార్మికులు నిర్లక్ష్యం చేయరాదన్నారు.జిల్లాలో వివిధ గ్యాస్ ఏజెన్సీలలో పనిచేస్తున్న గ్యాస్ డెలివరీ బాయ్ లు ఇంటింటికి గ్యాస్ సిలిండర్లు డోర్ డెలివరీ చేసే సమయంలో ఇంటి యజమానుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. గ్యాస్ బాయ్ లు గ్యాస్ బిల్లులో ఉన్న రేటు కంటే ఒక్క రూపాయి కూడా ఎక్కువ డబ్బులు వసూలు చేయరాదన్నారు. అధిక డబ్బులు వసూలు చేస్తే ఆయా గ్యాస్ ఏజెన్సీ లపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. డీలర్ షాపు యజమానులు ప్రతినెల రేషన్ సరుకులను సక్రమంగా ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు నాణ్యమైన సరుకులు ప్రజలకు ఇవ్వాలన్నారు. సరుకుల పంపిణీలో ప్రజల నుంచి ఎటువంటి వ్యతిరేకత రాకూడదన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న శ్రీ శక్తి పథకం మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ పథకంలో ప్రయాణికులకు ఆర్టీసీ బస్టాండ్లలో మెరుగైన వసతులు కల్పించాలన్నారు.ఆర్టీసీ బస్టాండు పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకొని ప్రయాణికులకు మంచినీటిని అందుబాటులో ఉంచాలన్నారు.

## డిసెంబరు 30న ముక్కోటి ఏకాదశి ఉత్సవం



మనగళం శ్రీశైలం డిసెంబరు 30న ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక ఉత్సవం నిర్వహించబడుతుంది. ఈ ఉత్సవం సందర్భంగా ఆరోజు వేకువజామున శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉత్తరద్వార దర్శనం, రావణవాహనసేవ నిర్వహించబడుతాయి. ఈ ఉత్సవంలో భాగంగానే ఉత్సవమూర్తులను స్వామివారి ఆలయ ముఖమండప ఉత్తరద్వారం నుండి వెలుపలకు తోడ్కొనివచ్చి ఆలయ ఉత్తరభాగంలో రావణవాహనంపై ఆశీనులను చేసి ప్రత్యేక పూజలు జరిపించబడతాయి. ముక్కోటి ఏకాదశి రోజు ఉదయం గం. 3. 00లకు ఆలయద్వారాలను తెరచి మంగళ వాయిద్యాల అనంతరం గం. 3. 30ని!!లకు స్వామివారికి సుప్రభాతసేవ నిర్వహించబడుతుంది. తరువాత శ్రీ స్వామిఅమ్మవార్లకు ప్రాత:కాలపూజలు జరిపించి గం. 4. 30 ని!!లకు స్వామివారికి, తరువాత అమ్మవారికి మహామంగళహారతులు జరిపించబడతాయి. అనంతరం ఉదయం 5. 30నిలకు రావణవాహనసేవ జరిపించబడుతుంది. ఆ తరువాత శ్రీస్వామిఅమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించబడుతుంది. శ్రీ స్వామిఅమ్మవార్ల గ్రామోత్సవం తదుపరి ఉదయం గం. 6. 00ల తరువాత దర్శనాలు, ఆర్జితసేవలు ప్రారంభమవుతాయి.

## షేర్ వ్యాపార రంగంలో దిగ్గజాలకు షాక్..





హైదరాబాద్ డిసెంబర్ 29, 2025 , మనగళం : పతంజలి ఫుడ్స్ తనదైన వ్యాపార వ్యూహంతో షేర్ వ్యాపార రంగంలో దూసుకుపోతోంది. సంస్థ వ్యాపార విస్తరణతో పాటు లాభాల పెరుగుదల పెట్టుబడిదారులకు గణనీయమైన ఫలితాలను అందిస్తోంది. గత ఐదేళ్ల కాలాన్ని పరిశీలిస్తే పతంజలి ఫుడ్స్ షేర్లు పెట్టుబడిదారులకు సుమారు 57 శాతం లాభాన్ని ఇచ్చాయి. అదే సమయంలో దేశంలోని ప్రముఖ వినియోగ వస్తువుల సంస్థలు ఈ స్థాయి రాబడిని అందించలేకపోయాయి. ఐదేళ్ల క్రితం పతంజలి ఫుడ్స్ షేర్ ధర సుమారు 347 రూపాయల వద్ద ఉండగా, ప్రస్తుతం అది 544 రూపాయల స్థాయికి చేరుకుంది. అంటే ఒక్కో షేర్‌పై సుమారు 197 రూపాయల లాభం నమోదైంది. ఇటీవల వారాల కనిష్ట స్థాయి 521 రూపాయలుగా ఉండగా, అక్కడి నుంచి కూడా షేర్ ధర నిలకడగా కొనసాగుతోంది. రాబోయే రోజుల్లో సంస్థ వ్యాపార విస్తరణ కొనసాగితే మరిన్ని లాభాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇదే కాలంలో దేశంలో అతిపెద్ద వినియోగ వస్తువుల సంస్థల్లో ఒకటైన హిందూస్థాన్ యూనిలీవర్ షేర్లు పెట్టుబడిదారులను నిరాశపరిచాయి. ఐదేళ్లలో ఈ సంస్థ షేర్ ధర సుమారు 4 శాతం తగ్గింది. కొంతకాలం గరిష్ట స్థాయిని తాకినా, ఆ తర్వాత స్థిరమైన పతనం కనిపించింది. డాబర్ సంస్థ పరిస్థితి కూడా అంతే. ఐదేళ్ల వ్యవధిలో డాబర్ షేర్లు సుమారు 8 శాతం నష్టాన్ని నమోదు చేశాయి. ఒక దశలో గరిష్ట స్థాయికి చేరుకున్నప్పటికీ, ఆ తర్వాత వరుసగా తగ్గుతూ ప్రస్తుతం ఐదేళ్ల క్రితం ధరల కంటే తక్కువ స్థాయిలో కొనసాగుతున్నాయి. నెస్లే ఇండియా మాత్రం కొంత మేర సానుకూల ఫలితాలను చూపింది. ఐదేళ్లలో ఈ సంస్థ షేర్లు సుమారు 39 శాతం లాభాన్ని ఇచ్చాయి. అయినప్పటికీ, ఈ లాభాలు పతంజలి ఫుడ్స్ ఇచ్చిన రాబడితో పోలిస్తే తక్కువగానే ఉన్నాయి. ఒక దశలో నెస్లే షేర్ ధర గరిష్టాన్ని తాకినా, ఆ తర్వాత హెచ్చుతగ్గులు కొనసాగుతున్నాయి. మొత్తంగా చూస్తే గత ఐదేళ్ల కాలంలో పతంజలి ఫుడ్స్ షేర్లు దేశంలోని అనేక దిగ్గజ వినియోగ వస్తువుల సంస్థలను వెనక్కి నెట్టి, పెట్టుబడిదారులకు అత్యుత్తమ లాభాలను అందించాయి. వ్యాపార విస్తరణ, ఉత్పత్తుల వైవిధ్యం, దేశీయ మార్కెట్‌పై గట్టి పట్టు ఇవన్నీ పతంజలి విజయానికి ప్రధాన కారణాలుగా ఆర్థిక వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# ప్రజలు సుఖశాంతులతో ఉండాలి.. రాజేష్ కుమార్ సింగ్

మన గళం బనగానపల్లెప్రజలు సుఖశాంతులతో ఉండాలి అని ఉమామహేశ్వర స్వామి వారిని కోరుకున్నట్లు జాయింట్ సెక్రటరీ పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ రాజేష్ కుమార్ సింగ్ సోమవారం అన్నారు. నంద్యాల జిల్లా బనగానపల్లె మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీ యాగంటి ఉమామహేశ్వర స్వామి దర్శనార్థం వచ్చిన రాజేష్ కుమార్ సింగ్ కి ఆలయ ఈవో జనార్ధన్, బండి మౌలీశ్వర్ రెడ్డి , ఆలయ అర్చకులు స్వాగతం పలికి దర్శన అనంతరం స్వామి వారి చిత్రపటంను అందచేయడం జరిగింది.



# ఐటీ రంగంలో ఉద్యోగ సంక్షోభం..



హైదరాబాద్ డిసెంబర్ 29, 2025 , మనగళం : ప్రపంచవ్యాప్తంగా సమాచార సాంకేతిక రంగంలో అనిశ్చితి కొనసాగుతోంది. కృత్రిమ మేధ ప్రవేశం, దేశాల మధ్య నెలకొన్న ఆర్థిక-రాజకీయ అస్థిరతల నేపథ్యంలో ఈ రంగం తీవ్రమైన ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. చిన్న సంస్థల నుంచి పెద్ద దిగ్గజాల వరకు తమ కార్యకలాపాల్లో ఆటోమేషన్‌ను పెంచుతూ మానవ వనరులను క్రమంగా తగ్గించుకుంటున్నాయి. దీని ప్రభావంతో వేలాది మంది ఉద్యోగులు తమ ఉపాధిని కోల్పోయి, వారి కుటుంబాలపై కూడా ఆర్థిక ఒత్తిడి పెరుగుతోంది. ఓ అధ్యయనం ప్రకారం ఈ ఏడాది ఒక్కటే ప్రపంచవ్యాప్తంగా ఐదువందలకు పైగా సాంకేతిక సంస్థలు కలిపి లక్ష ఇరవై రెండు వేల మందికిపైగా ఉద్యోగులను తొలగించాయి. వ్యయ నియంత్రణ, లాభాల పరిరక్షణ పేరుతో ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం. భారతదేశానికి చెందిన సంస్థలతో పాటు అంతర్జాతీయ సంస్థలు కూడా ఇదే బాటలో నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ-వాణిజ్య దిగ్గజం అమెజాన్ అక్టోబర్ నెలలోనే దాదాపు పద్నాలుగు వేల మందిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించింది. సంస్థ చరిత్రలో ఇదే అతిపెద్ద కొలువుల కోతగా నిలిచింది. క్లౌడ్ సేవలు, పరికరాల విభాగం, చిల్లర వ్యాపారం, ప్రకటనలు, కిరాణా విభాగాల్లోని ఉద్యోగులు ఈ నిర్ణయంతో ప్రభావితమయ్యారు. సాఫ్ట్‌వేర్ రంగంలోని మరో పెద్ద సంస్థ మైక్రోసాఫ్ట్ కూడా ఖర్చుల నియంత్రణలో భాగంగా ఈ ఏడాది పదిహేను వేల మందికిపైగా ఉద్యోగులను తొలగించింది. ముఖ్యంగా జులై నెలలోనే తొమ్మిది వేల మంది తమ ఉద్యోగాలు కోల్పోయారు. సంస్థలో పునర్వ్యవస్థీకరణ చర్యలు ఇంకా కొనసాగుతున్నట్లు సమాచారం. భారతదేశానికి చెందిన అతిపెద్ద సమాచార సాంకేతిక సంస్థ టీసీఎస్ కూడా ఈ వరుసలో చేరింది. సంస్థలోని మొత్తం ఉద్యోగుల్లో సుమారు రెండు శాతానికి సమానమైన పన్నెండు వేల మందిని తొలగించింది. ఈ ప్రకటన దేశీయ ఐటీ రంగాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. కృత్రిమ మేధ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సిబ్బంది అవసరం తగ్గిందని సంస్థ వర్గాలు పేర్కొన్నాయి. చిప్ తయారీ రంగంలో పేరుగాంచిన ఇంటెల్ సంస్థ కూడా ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ ఏడాది కొత్త కార్యనిర్వాహక అధికారి బాధ్యతలు చేపట్టిన తర్వాత సంస్థలో పెద్ద ఎత్తున పునర్వ్యవస్థీకరణ ప్రారంభమైంది. దానిలో భాగంగా ఉద్యోగుల సంఖ్యను గణనీయంగా తగ్గించాలని నిర్ణయించింది. గత ఏడాది చివరికి లక్షకు పైగా ఉన్న ఉద్యోగులను ఈ ఏడాది చివరికి డెబ్బై ఐదు వేల వరకు పరిమితం చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఇవే కాకుండా సేల్స్‌ఫోర్స్ సంస్థ నాలుగు వేల మంది కస్టమర్ సేవల సిబ్బందిని తొలగించినట్లు వెల్లడించింది. కృత్రిమ మేధ ద్వారానే అనేక పనులు సాగుతున్నాయని సంస్థ అధిపతి పేర్కొన్నారు. వ్యక్తిగత కంప్యూటర్ల తయారీ సంస్థ హెచ్‌పీ కూడా సుమారు ఆరు వేల మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు ప్రకటించింది. అలాగే యాపిల్, మెటా, గూగుల్, వెరిజోన్, సీమెన్స్ వంటి సంస్థలు కూడా భారీగా కొలువుల కోతలు చేపట్టాయి. మొత్తంగా చూస్తే 2025 సంవత్సరం సమాచార సాంకేతిక రంగ ఉద్యోగులకు కఠిన కాలంగా మారింది. ఆటోమేషన్, కృత్రిమ మేధ విస్తరణతో భవిష్యత్తులోనూ ఇలాంటి పరిస్థితులు కొనసాగవచ్చన్న ఆందోళన ఉద్యోగ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# కేవలం 91 రూపాయల రీఛార్జ్‌తో 28 రోజుల చెల్లుబాటు..




హైదరాబాద్ డిసెంబర్ 29, 2025 , మనగళం : తక్కువ ఖర్చుతో ఎక్కువ రోజుల చెల్లుబాటు కోరుకునే వినియోగదారులకు జియో ఓ ప్రత్యేక రీఛార్జ్ ఎంపికను అందిస్తోంది. కేవలం 91 రూపాయలతో 28 రోజుల పాటు సేవలు పొందే అవకాశం ఈ పథకం ద్వారా లభిస్తోంది. ఈ రీఛార్జ్‌లో డేటా, వాయిస్ కాలింగ్, సందేశాల సదుపాయాలు ఉన్నాయి. ఈ పథకం కింద మొత్తం 3 గిగాబైట్ల డేటా లభిస్తుంది. ఇందులో రోజుకు 100 మెగాబైట్ల చొప్పున డేటా ఇవ్వడంతో పాటు అదనంగా 200 మెగాబైట్ల డేటాను అందిస్తున్నారు. మొత్తం చెల్లుబాటు కాలంలో వినియోగదారులు 2. 8 గిగాబైట్ల డేటాతో పాటు అదనపు డేటాను ఉపయోగించుకోవచ్చు. డేటా పరిమితి పూర్తయ్యాక వేగం తగ్గినా ఇంటర్నెట్ వినియోగం కొనసాగుతుంది. అలాగే 28 రోజుల పాటు అన్ని నెట్‌వర్క్‌లకు పరిమితి లేని వాయిస్ కాలింగ్ సదుపాయం ఉంది. మొత్తం చెల్లుబాటు కాలానికి 50 సందేశాలను కూడా పంపుకోవచ్చు. అయితే ఈ పథకం అందరికీ అందుబాటులో లేదని గమనించాలి. ఇది ప్రత్యేకంగా జియోఫోన్ వినియోగదారుల కోసం మాత్రమే రూపొందించబడింది. సాధారణ జియో వినియోగదారులు ఈ రీఛార్జ్‌ను ఉపయోగించుకోలేరు. జియోఫోన్ వినియోగదారులకు తక్కువ ధరలో ఎక్కువ రోజుల సేవలు అందించే ఈ రీఛార్జ్ మంచి ఎంపికగా మారింది. తక్కువ వినియోగం ఉన్నవారికి, కాలింగ్ అవసరాలు ఎక్కువగా ఉండే వారికి ఈ పథకం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని టెలికాం నిపుణులు చెబుతున్నారు.

# రూ.15000 లోపు ధరలో ఆకట్టుకునే స్మార్ట్‌ఫోన్లు ఇవే

హైదరాబాద్ డిసెంబర్ 29, 2025 , మనగళం : తక్కువ బడ్జెట్‌లో కొత్త స్మార్ట్‌ఫోన్ కొనాలని భావించే వారికి ప్రస్తుతం మార్కెట్‌లో మంచి ఎంపికలు అందుబాటులో ఉన్నాయి. రూ. 15000 లోపు ధరలోనే వేగవంతమైన ఐదో తరం నెట్‌వర్క్ సదుపాయం, శక్తివంతమైన ప్రాసెసర్, మెరుగైన కెమెరా, పెద్ద బ్యాటరీ వంటి ఫీచర్లతో ఫోన్లు లభిస్తున్నాయి. యువత, విద్యార్థులు, మొదటిసారి స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేసే వారికి ఈ ధర శ్రేణి బాగా ఉపయోగపడుతోంది. ఈ విభాగంలో రెడ్మి 15సి ఐదో తరం, వివో టి4ఎక్స్ ఐదో తరం, ఒప్పో కె13ఎక్స్ ఐదో తరం, శాంసంగ్ గెలాక్సీ ఎం17 ఐదో తరం, రియల్మి పి3ఎక్స్ ఐదో తరం, ఐకూ జెడ్10ఎక్స్ ఐదో తరం, పోకో ఎం7 ప్లస్ వంటి మోడళ్లు వినియోగదారుల నుంచి మంచి స్పందన పొందుతున్నాయి. ఇవన్నీ రోజువారీ వినియోగంతో పాటు గేమింగ్, వీడియోలు చూడటం, అనేక యాప్‌లను ఒకేసారి ఉపయోగించే పనులకు అనుకూలంగా రూపొందించబడ్డాయి. ఈ ఫోన్లలో కొన్ని అధిక రిఫ్రెష్ రేట్ డిస్‌ప్లే, వేగవంతమైన ఛార్జింగ్ సదుపాయం, పవర్‌ను ఆదా చేసే చిప్‌సెట్లతో వస్తున్నాయి. ఫోటోగ్రఫీపై ఆసక్తి ఉన్నవారికి కూడా ఈ ధరలోనే మెరుగైన కెమెరా పనితీరు లభిస్తోంది. పెద్ద బ్యాటరీల కారణంగా ఒకసారి ఛార్జ్ చేస్తే ఎక్కువసేపు ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. బ్యాంకు ఆఫర్లు, మార్పిడి డీల్స్, ఆన్‌లైన్ అమ్మకాల సమయంలో ఈ ఫోన్ల ధరలు ఇంకా తగ్గే అవకాశం ఉంది. కాబట్టి కొనుగోలు ముందు ఫీచర్లు, ధరలు, వినియోగదారుల అభిప్రాయాలను పరిశీలించి తమ అవసరాలకు సరిపోయే ఫోన్‌ను ఎంపిక చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.



## స్మృతి అరుదైన ఘనతతో కొత్త చరిత్ర




తిరువనంతపురం డిసెంబర్ 29, 2025 , మనగళం : భారత మహిళా క్రికెట్‌లో మరో స్వర్ణాధ్యాయం నమోదైంది. స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన తన కెరీర్‌లో అరుదైన ఘనత సాధించి ప్రపంచ క్రికెట్‌లోనే ప్రత్యేక గుర్తింపు పొందింది. ఆదివారం శ్రీలంకతో జరిగిన నాలుగో అంతర్జాతీయ ఇరవై ఓవర్ల మ్యాచ్‌లో ఆమె అద్భుత ప్రదర్శనతో అనేక రికార్డులను బద్దలు కొట్టింది. ఈ మ్యాచ్‌లో 27 పరుగుల దూరంలో ఉన్న 10000 పరుగుల మైలురాయిని కేవలం 20 బంతుల్లోనే దాటిన స్మృతి, అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన క్రీడాకారిణిగా నిలిచింది. ఈ క్రమంలో దిగ్గజ క్రికెటర్ మిథాలీ రాజ్ పేరిట ఉన్న ప్రపంచ రికార్డును అధిగమించింది.తిరువనంతపురంలోని గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో స్మృతి 48 బంతుల్లో 80 పరుగులు చేసింది. ఆమె ఇన్నింగ్స్‌లో 11 బౌండరీలు, 3 భారీ సిక్సర్లు ఉండగా, శ్రీలంక బౌలర్లపై పూర్తి ఆధిపత్యం చూపించింది. ఈ ఇన్నింగ్స్‌తో భారత జట్టు భారీ స్కోరు సాధించడంలో ఆమె కీలక పాత్ర పోషించింది.ఈ ఘనతతో స్మృతి, మిథాలీ రాజ్, న్యూజిలాండ్‌కు చెందిన సుజీ బేట్స్, ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ షార్లెట్ ఎడ్వర్డ్స్ సరసన నిలిచింది. ఇదే సిరీస్‌లో ఆమె 4000 అంతర్జాతీయ ఇరవై ఓవర్ల పరుగులు పూర్తి చేసిన తొలి భారత మహిళా బ్యాటర్‌గా కూడా రికార్డు సృష్టించింది. అలాగే 2025 సంవత్సరంలో వన్డేల్లో అత్యధికంగా 1362 పరుగులు చేసిన క్రీడాకారిణిగా అగ్రస్థానంలో నిలిచింది.మూడు ఫార్మాట్లలో శతకాలు సాధించిన తొలి భారత మహిళా క్రికెటర్‌గా ఇప్పటికే గుర్తింపు పొందిన స్మృతి, ఇప్పుడు మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. శ్రీలంక సిరీస్ ముగిసిన తర్వాత, జనవరి 9 నుంచి ప్రారంభమయ్యే మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు కెప్టెన్‌గా ఆమె బాధ్యతలు చేపట్టనుంది. ఈ వరుస విజయాలతో స్మృతి మంధాన భారత మహిళా క్రికెట్‌కు గర్వకారణంగా నిలుస్తోంది.

## న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు ముందు భారత జట్టులో భారీ మార్పులు



హైదరాబాద్ డిసెంబర్ 29, 2025 , మనగళం : న్యూజిలాండ్‌తో జరగనున్న మూడు వన్డేల సిరీస్‌కు ముందు భారత క్రికెట్ జట్టులో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఈ సిరీస్‌కు స్టార్ ఆటగాళ్లు హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి ఇవ్వాలని జట్టు నిర్వహణ నిర్ణయించినట్లు సమాచారం. ఆటగాళ్ల పనిభారం తగ్గించడం, గాయాల ప్రమాదాన్ని నివారించడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. అయితే వెంటనే జరగబోయే ఐదు టీ20ల సిరీస్‌కు మాత్రం వీరిద్దరూ అందుబాటులో ఉండనున్నారు.ఇటీవల కాలంలో హార్దిక్ పాండ్యా వన్డే ఫార్మాట్‌కు దూరంగా ఉంటుండగా, బుమ్రా నిరంతరం అన్ని ఫార్మాట్లలో ఆడటం వల్ల అతనిపై ఒత్తిడి పెరిగిందని సెలెక్టర్లు భావిస్తున్నారు. అందుకే న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లో వీరిద్దరికీ విశ్రాంతి ఇవ్వాలని నిర్ణయించారు. ఇదే సమయంలో సీనియర్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ కూడా ఈ వన్డే సిరీస్‌కు ఎంపిక కాకపోవచ్చని సమాచారం.ఈ పరిణామాలతో దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తున్న ఇషాన్ కిషన్‌కు మళ్లీ భారత వన్డే జట్టులో చోటు దక్కే అవకాశాలు మెరుగయ్యాయి. ఇటీవల దేశవాళీ టోర్నీల్లో నిలకడైన ప్రదర్శనతో సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించిన కిషన్‌కు ఇది కీలక అవకాశం కావచ్చని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. వన్డే సిరీస్‌కు సంబంధించిన భారత జట్టును జనవరి 4 లేదా 5 తేదీల్లో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.మరోవైపు అంతర్జాతీయ వన్డేలకు విశ్రాంతి తీసుకున్నప్పటికీ, హార్దిక్ పాండ్యా దేశవాళీ క్రికెట్‌కు దూరంగా ఉండడం లేదు. బరోడా జట్టు తరఫున విజయ్ హజారే ట్రోఫీలో రెండు మ్యాచ్‌లు ఆడాలని ఆయన నిర్ణయించుకున్నాడు. కేంద్ర కాంట్రాక్టు ఉన్న ఆటగాళ్లు దేశవాళీ టోర్నీల్లో తప్పనిసరిగా పాల్గొనాలన్న నియమాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మార్పులతో న్యూజిలాండ్ సిరీస్‌లో కొత్త ముఖాలు, కొత్త కలయికలతో భారత జట్టు బరిలోకి దిగనుందని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## ప్రపంచ కప్ విజయం గొప్ప మార్పు తెచ్చింది: రిచా ఘోష్

తిరువనంతపురం డిసెంబర్ 29, 2025 , మనగళం : మహిళల వన్డే ప్రపంచ కప్ 2025లో భారత్ చరిత్రాత్మక విజయం సాధించిన విషయం తెలిసిందే. ఎన్నేళ్ల నిరీక్షణకు తెరదింపుతూ హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలో భారత జట్టు దక్షిణాఫ్రికాను ఓడించి విశ్వ విజేతగా నిలిచింది. ఆ విజయం తర్వాత భారత మహిళా క్రికెట్‌కు వచ్చిన గుర్తింపు ఇప్పుడు ప్రతి సిరీస్‌లో స్పష్టంగా కనిపిస్తోంది.ప్రస్తుతం భారత జట్టు శ్రీలంకతో ఐదు టీ20ల సిరీస్ ఆడుతోంది. తిరువనంతపురం వేదికగా జరిగిన మ్యాచ్‌లో భారత్ 30 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో సిరీస్‌లో భారత్ 40 ఆధిక్యంలో నిలిచింది. ఈ మ్యాచ్‌లో రిచా ఘోష్ కేవలం 16 బంతుల్లోనే 40 పరుగులు చేసి ఆకట్టుకుంది. నాలుగు ఫోర్లు, మూడు సిక్సులతో ఆమె జట్టు భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించింది. నిర్ణీత 20 ఓవర్లలో భారత్ 221 పరుగులు చేయడంలో రిచా ఇన్నింగ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.మ్యాచ్ అనంతరం మాట్లాడిన రిచా ఘోష్, ప్రపంచ కప్ విజయం తమ జీవితాలను ఎలా మార్చిందో వివరించింది. ప్రపంచ కప్ గెలిచిన తర్వాత తమపై ప్రజల దృష్టి పూర్తిగా మారిందని ఆమె తెలిపింది. మేము ఎక్కడికి వెళ్లినా అభిమానులు ఎంతో ఆప్యాయంగా పలకరిస్తున్నారని, జట్టులోని ప్రతి ఆటగాడిని ప్రజలు గుర్తుపడుతున్నారని చెప్పింది. దీప్తి శర్మ, షెఫాలీ వర్మ, తనలాంటి ఆటగాళ్ల పేర్లు కూడా ఇప్పుడు అందరికీ తెలుసని, ఇది అంతా ప్రపంచ కప్ విజయం వల్లే సాధ్యమైందని రిచా పేర్కొంది.ప్రపంచ కప్ గెలిచిన తర్వాత జట్టులో ఆత్మవిశ్వాసం గణనీయంగా పెరిగిందని ఆమె వెల్లడించింది. అదే ఆత్మవిశ్వాసం ప్రతి సిరీస్‌లో మెరుగైన ప్రదర్శనకు దోహదపడుతోందని చెప్పింది. తాను పైక్రమంలో బ్యాటింగ్ చేసే అవకాశం వచ్చినప్పుడు జట్టును బలమైన స్థితిలో నిలబెట్టాలనే లక్ష్యంతో ఆడినట్టు తెలిపింది. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండటం, బంతి బ్యాట్‌పై బాగా రావడం తమకు ఉపయోగపడిందని పేర్కొంది. షాట్ ఎంపిక చాలా కీలకమని, దానిని సరిగ్గా అమలు చేయగలిగినందువల్లే భారీ స్కోరు సాధ్యమైందని రిచా ఘోష్ స్పష్టం చేసింది.

## ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర..



కరాచీ డిసెంబర్ 29, 2025 , మనగళం : పాకిస్థాన్ దేశవాళీ క్రికెట్‌లో అరుదైన రికార్డు నమోదైంది. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అత్యంత వేగంగా డబుల్ సెంచరీ సాధించిన ఆటగాడిగా షాన్ మసూద్ చరిత్ర సృష్టించాడు. ప్రెసిడెంట్స్ కప్ డిపార్ట్‌మెంటల్ టోర్నీలో సూయి నార్తర్న్ గ్యాస్ జట్టు తరఫున బరిలోకి దిగిన షాన్ మసూద్ కేవలం 177 బంతుల్లోనే 200 పరుగులు పూర్తి చేసి సంచలనం రేపాడు.ఈ ప్రదర్శనతో దాదాపు మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న పాత రికార్డు బద్దలైంది. గతంలో ఈ ఘనత పాకిస్థాన్ దిగ్గజ బ్యాటర్ ఇంజమామ్ ఉల్ హక్ పేరిట ఉండేది. 1992లో ఆయన 188 బంతుల్లో డబుల్ సెంచరీ సాధించగా, ఇప్పుడు షాన్ మసూద్ ఆ రికార్డును అధిగమించాడు. పాకిస్థాన్ టెస్టు జట్టు కెప్టెన్‌గా ఉన్న షాన్ మసూద్ దేశవాళీ క్రికెట్‌లో ఇలాంటి అద్భుత ఇన్నింగ్స్ ఆడటం విశేషంగా మారింది.దూకుడైన బ్యాటింగ్‌తో పాటు నిలకడగా పరుగులు రాబట్టిన షాన్ మసూద్ ప్రత్యర్థి బౌలర్లకు ఏ మాత్రం అవకాశం ఇవ్వలేదు. బౌండరీలతో స్కోరు వేగంగా పెంచుతూ మ్యాచ్‌పై పూర్తి ఆధిపత్యం చూపించాడు. అతడి ఇన్నింగ్స్‌లో ఆత్మవిశ్వాసం, అనుభవం స్పష్టంగా కనిపించిందని క్రికెట్ వర్గాలు ప్రశంసిస్తున్నాయి.ఇదే సమయంలో పాకిస్థాన్ గడ్డపై వేగవంతమైన డబుల్ సెంచరీల ప్రస్తావన వస్తే భారత దిగ్గజ బ్యాటర్ వీరేంద్ర సెహ్వాగ్ పేరు కూడా గుర్తుకు వస్తుంది. 2006లో లాహోర్‌లో జరిగిన టెస్టులో ఆయన 182 బంతుల్లో డబుల్ సెంచరీ సాధించి అప్పట్లో ప్రపంచ క్రికెట్‌ను ఆశ్చర్యానికి గురి చేశాడు. ఇప్పుడు అదే గడ్డపై షాన్ మసూద్ మరింత వేగంగా ఈ ఘనత సాధించడం పాకిస్థాన్ క్రికెట్‌కు గర్వకారణంగా మారింది.ఈ రికార్డు ఇన్నింగ్స్‌తో షాన్ మసూద్‌పై దేశవ్యాప్తంగా ప్రశంసల జల్లు కురుస్తోంది. దేశవాళీ క్రికెట్‌లో ఇలాంటి ప్రదర్శనలు యువ ఆటగాళ్లకు ప్రేరణగా నిలుస్తాయని, పాకిస్థాన్ బ్యాటింగ్ బలాన్ని మరింత పెంచుతాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## మెల్‌బోర్న్ పిచ్‌పై ఐసీసీ అసంతృప్తి..




సిడ్నీ డిసెంబర్ 29, 2025 , మనగళం : యాషెస్ సిరీస్‌లో భాగంగా మెల్‌బోర్న్ వేదికగా జరిగిన నాలుగో టెస్టు మ్యాచ్ కేవలం రెండు రోజుల్లోనే ముగియడం తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ జట్టు నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించినప్పటికీ, టెస్టు మ్యాచ్ ఇంత త్వరగా ముగియడంపై క్రికెట్ వర్గాల్లో విస్తృత విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ క్రికెట్ మండలి మెల్‌బోర్న్ పిచ్‌పై సమీక్ష చేపట్టి తన తుది నివేదికను విడుదల చేసింది.ఐసీసీ పిచ్ అండ్ ఔట్‌ఫీల్డ్ మానిటరింగ్ విధానంలో భాగంగా చేసిన పరిశీలనలో మెల్‌బోర్న్ పిచ్‌ను అసంతృప్తికరంగా ప్రకటించింది. ఈ పిచ్‌కు ఒక డీమెరిట్ పాయింట్ కూడా విధించినట్లు వెల్లడించింది. మ్యాచ్ రిఫరీ జెఫ్ క్రోవ్ సమర్పించిన నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.నివేదిక ప్రకారం తొలి రోజే ఇరుజట్ల కలిపి మొత్తం 20 వికెట్లు పడిపోయాయి. రెండో రోజున మరో 16 వికెట్లు కూలడంతో మ్యాచ్ పూర్తిగా బౌలర్ల ఆధిపత్యంలోనే సాగింది. రెండు రోజుల్లో మొత్తం 36 వికెట్లు పడిపోవడం టెస్టు క్రికెట్ స్వభావానికి విరుద్ధమని ఐసీసీ అభిప్రాయపడింది. ముఖ్యంగా ఒక్క బ్యాటర్ కూడా అర్ధ శతకం సాధించలేకపోవడం పిచ్ స్వభావాన్ని స్పష్టంగా చూపిందని నివేదికలో పేర్కొన్నారు.మార్గదర్శక నిబంధనల ప్రకారం బ్యాటింగ్, బౌలింగ్ రెండింటికీ సమతూకం ఉండాల్సిన అవసరం ఉందని ఐసీసీ గుర్తు చేసింది. కానీ మెల్‌బోర్న్ పిచ్ పూర్తిగా బౌలర్లకు అనుకూలంగా మారడంతో మ్యాచ్ నాణ్యతపై ప్రభావం పడిందని స్పష్టం చేసింది. ఈ కారణంగానే పిచ్‌ను అసంతృప్తికరంగా గుర్తిస్తూ వేదికకు డీమెరిట్ పాయింట్ విధించినట్లు జెఫ్ క్రోవ్ తన నివేదికలో తెలిపారు.ఈ నిర్ణయంతో భవిష్యత్‌లో మెల్‌బోర్న్ వేదికపై పిచ్ తయారీపై మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. టెస్టు క్రికెట్ గౌరవాన్ని కాపాడేందుకు ఇలాంటి అంశాలపై కఠినంగా వ్యవహరిస్తామని ఐసీసీ స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది.

## గంభీర్ రంజీ కోచ్‌గా మారితేనే మేలు..

హైదరాబాద్ డిసెంబర్ 29, 2025 మనగళం :, టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై విమర్శలు మరింత తీవ్రమవుతున్నాయి. టెస్టు క్రికెట్‌లో భారత జట్టు వరుస పరాజయాలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ఇంగ్లండ్ మాజీ స్పిన్నర్ మాంటీ పనేసర్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. భారత జట్టు టెస్టుల్లో విఫలమవడానికి కోచ్‌గా గంభీర్ కూడా బాధ్యత వహించాల్సిందేనని స్పష్టం చేశాడు. వైట్ బాల్ క్రికెట్‌లో గంభీర్ మంచి కోచ్‌గా నిరూపించుకున్నప్పటికీ, రెడ్ బాల్ ఫార్మాట్‌లో జట్టును నిర్మించడంలో లోపాలు కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించాడు.గంభీర్‌కు టెస్టు క్రికెట్‌పై పూర్తి అవగాహన పెరగాలంటే రంజీ ట్రోఫీలో ఏదైనా జట్టుకు కోచ్‌గా పనిచేయడం అతడికే మేలు చేస్తుందని పనేసర్ అభిప్రాయపడ్డాడు. దేశవాళీ క్రికెట్‌లో ఆటగాళ్లను తీర్చిదిద్దడం, దీర్ఘకాలికంగా జట్టును ఎలా నిర్మించాలో అక్కడే నేర్చుకోవచ్చని తెలిపాడు. ప్రస్తుతం భారత టెస్టు జట్టు బలహీనంగా కనిపిస్తోందని, మళ్లీ పుంజుకోవాలంటే సమయం పడుతుందని అన్నాడు. ముగ్గురు సీనియర్ ఆటగాళ్లు రిటైర్మెంట్ తీసుకుంటే, మిగతా యువ ఆటగాళ్లు అంత త్వరగా ఆ స్థాయికి చేరడం కష్టమేనని కూడా పేర్కొన్నాడు.శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీపై కూడా పనేసర్ స్పందించాడు. గిల్‌లో అపారమైన ప్రతిభ ఉన్నప్పటికీ, అతడి షాట్ సెలక్షన్‌లో ఇంకా మెరుగుదల అవసరమని అభిప్రాయపడ్డాడు. విరాట్ కోహ్లీ బ్యాటింగ్‌లో కనిపించే దూకుడు, పరిణితి అన్ని ఫార్మాట్లలోనూ గిల్‌లో కనిపించడంలేదని అన్నాడు. అలాగే అన్ని ఫార్మాట్లకు గిల్ కెప్టెన్‌గా ఉండడం అతడికి తలకు మించిన భారం అవుతుందని వ్యాఖ్యానించాడు. ఈ వ్యాఖ్యలు భారత క్రికెట్ వర్గాల్లో కొత్త చర్చకు దారి తీస్తున్నాయి.


Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP. Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.